teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 279 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 16 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## యాదగిరిగుట్ట స్వర్ణ గోపుర సంప్రోక్షణకు సన్నాహాలు

ఐదు రోజుల పాటు స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభాభిషేక మహోత్సవాలు



02



మూడు లక్షల కుటుంబాలకు

## మరోసారి కులగణన సర్వే

నమోదు చేసుకోనివారికి ఫిబ్రవరి 16 నుండి 28 వరకు అవకాశం



## ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు స్థితి తెలుసా..?

వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం



# మద్యం అమ్మకాల జోరు

## డిమాండ్ తగ్గట్టుగా బీర్ల ఉత్పత్తి..



రాష్ట్రంలో మద్యం అమ్మకాల జోరు ఊపందుకుంది. రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్.. దీంతో రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈమేరకు డిమాండ్ కు తగ్గట్లు బీర్ల కంపెనీలు ఉత్పత్తిని పెంచేశాయి.

**తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్):** డిమాండ్ కు తగ్గట్లు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 13 సంస్థలు బీర్లను తయారు చేస్తుండగా.. నాలుగు కంపెనీల్లో మూడు షిఫ్టుల్లోనూ తయారీని వేగవంతం

మిగతా 2 లో

# బహిరంగ చర్చకు సిద్ధమా..?

## రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

నల్గొండ, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల

మిగతా 2 లో



## అవినీతి అధికారి ఇంట్లో రూ. 100 కోట్ల ఆస్తులు..?

ఏడీఈ సతీశ్ కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు

భారీగా స్థిరాస్తి పత్రాలు బంగారం, నగదు స్వాధీనం

రూ. 100 కోట్ల విలువ ఉండనున్నట్లు అంచనా


తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): రూ . 70 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏడీఈ సతీశ్ కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గచ్చిబౌలిలోని విద్యుత్ ఆఫీసీలో ఏడీఈగా పనిచేస్తున్న కొట్టే సతీష్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్, సి.టి. మీటర్ ఏర్పాటుకు లంచం డిమాండ్ చేశాడు. మొత్తం 75 వేలు లంచం డిమాండ్ చేసి ఇప్పటికే రూ. 25000 తీసుకొని రెండో విడతగా రూ.50,000 లంచం తీసుకుంటూ తెలంగాణ ఏసీబీ

మిగతా 2 లో

## 2008 డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలు

ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

1382 మందికి కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సర్కార్ 2008 డీఎస్సీ బాధితులకు గుడ్ న్యూస్ తెలిపింది. 2008 డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలు కల్పిస్తూ


మిగతా 2 లో

## హాజ ఐపీఏ పేరుతో బీర్ టిన్లపై మహాత్మాగాంధీ ఫోటో

ఓ మద్యం కంపెనీ బరితెగింపు

ఫోటోతో పాటు పేరు, సంతకం ముద్రించి విక్రయాలు

ప్రధానికి సీఎం మనవడు ఫిర్యాదు




02




## సెపీ సంరక్షణలోని శత్రు ఆస్తుల లెక్క తెల్చాలి

### అధికారులను ఆదేశించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా (సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీ)కు సంబంధించి మార్చి నెలాఖరులోపు రికార్డుల పరిశీలన, గ్రౌండ్ సర్వే పూర్తి చేసి లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బేగంపేట హోటల్ టూరిజం ప్లాజాలో రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్

మిగతా 3 లో

## ప్రధాని మోడీపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు

పుట్టుకతోనే మోడీ బీసీ కాదు అని చెప్పాను

జన గణనలో కులగణన చేసి చూపాలి

దేశంలో కులగణనకై డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి



ప్రధాని నరేంద్ర మోడీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ప్రధాని నరేంద్ర మోడీని వ్యక్తిగతంగా దూషించలేదు.

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): ప్రధాని హోదాను అగౌరవపర్చలేదు. పుట్టుకతోనే ఆయన బీసీ కాదు అని మాత్రమే చెప్పాను. మోడీకి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే జన గణనలో కులగణన చేసి చూపించాలి అని డిమాండ్ చేశారు. అంతేకాదు తమ నాయకుడు రాహుల్ గాంధీతో

మిగతా 2 లో



## డ్రోన్లు యుద్ధరంగాన్ని విప్లవాత్మకంగా మార్చేశాయ్

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వాఖ్యలు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): డ్రోన్లు యుద్ధరంగాన్ని విప్లవాత్మకంగా మార్చేశాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. డ్రోన్ల తయారీ, అనుబంధ రంగాల అభివృద్ధికి ఉన్న అవకాశాలు ఉద్యోగాల కల్పన, ఆర్థికాభివృద్ధి

మిగతా 2 లో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనడం

## దారుణం

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందే

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



ఖమ్మం, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తామనడం దారుణమని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని


మిగతా 2 లో

## ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి టెండర్ దాఖిలు గడువు పెంపు

ఈ నెల 23ఈ నెల 23 వరకు పెంచిన ఎన్‌హెచ్ఏఐ

5 ప్యాకేజీలుగా టెండర్ల ఆహ్వానం

02



## హైదరాబాద్‌లో మెట్రో రైల్ విస్తరణ కార్యక్రమాలు

మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



# మద్యం అమ్మకాల జోరు

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఒక్కో కంపెనీ రోజుకు 2 లక్షల బీర్లను తయారు చేసి డిపోలకు సరఫరా చేసేలా ప్రణాళికలు వేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కువశాతం బీర్లు తయారు చేసే కంపెనీ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్. అయితే ఈ కంపెనీ సహా మొత్తం 13 కంపెనీలు రోజుకు సగటున 1.5 లక్షల నుంచి 2 లక్షల కాటన్ల బీర్లను డిపోలకు సప్లయ్ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నాయి. సంబంధిత రుసుములు కూడా చెల్లించాయి. సాధారణ రోజుల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో మాత్రమే బీర్లను తయారీ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. దీంతో మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తున్నాయి. వీటిలో కింగ్‌ఫిషర్ సహా వివిధ బ్రాండ్లకు చెందిన బీర్లు సప్లయ్ అవుతున్నాయి. ఇలా ఆయా కంపెనీల నుంచి ప్రతి రోజు సగటున లక్షన్నర కాటన్ల బీర్లు 19 డిపోలకు చేరుతున్నాయి. మరోవైపు ఇటీవల బీర్ల ధరలను 15 నుంచి 20శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన మద్యం ధరలు ఈనెల 11 నుంచే అమల్లోకి వచ్చాయి. ధరల పెంపు వల్ల ఏడాదికి రూ.2వేల కోట్లు ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.



## బహిరంగ చర్చకు సిద్ధమా



మొదటి పేజీ తరువాయి

రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. శనివారం నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## అవినీతి అధికారి ఇంట్లో రూ. 100 కోట్ల ఆస్తులు..?

మొదటి పేజీ తరువాయి

అధికారులకు టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్. గచ్చిబౌలి సబ్ డివిజన్‌లోని అసిస్టెంట్ డివిజనల్ కొట్టే సతీష్ పట్టుబడినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా ఈ రోజు అతనికి సంబంధించిన నివాసంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా అధికారులు కంగుతినే ఆస్తులు బయటపడ్డాయి. అధికారుల తనిఖీల్లో భారీగా స్థిరాస్తి పత్రాలు బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సతీష్ కు హైదరాబాద్ తో పాటు రంగారెడ్డి, కరీంనగర్, జిల్లాలో స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కాగా వీటి విలువ దాదాపు 100 కోట్ల వరకు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తనిఖీల అనంతరం సతీశ్ నివాసంలో లభ్యమైన బంగారం, నగదు, పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు సతీశ్‌ను రిమాండ్ కు తరలించారు.

## మూడు లక్షల కుటుంబాలకు "మరోసారి" కులగనన సర్వే

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో దాదాపు 50 రోజుల పాటు నిర్వహించిన కులగణనలో మూడు లక్షల కుటుంబాలకు పైగా తమ వివరాలను నమోదు చేసుకోలేదు. దీంతో వారందరి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. కులగణనలో వివరాలు నమోదు చేసుకొని వారు ఫిబ్రవరి 16 నుండి ఈ నెల 28వ తేదీ వరకు కులగణన రీ సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. నేటి నుంచి జరిగే ఈ రీ సర్వే కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కాల్ సెంటర్ పని చేయనుంది. ఇప్పటి వరకు కులగణనలో నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్‌కు కాల్ చేసి పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు స్థితి తెలుసా..?

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): మీరు ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేశారా.. అయితే మీకో గుడ్ న్యూస్. మీ అప్లికేషన్ స్టేటస్ ఏంటి, సర్వే పూర్తయిందా.. ఇల్లు మంజూరైందా.. అయితే ఎన్నో జాబితాలో వస్తుంది. ఒకవేళ మంజూరు కాకుంటే ఎందుకు రాలేదు వంటి వివరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మీ చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు చిటికెలో పై వివరాలన్నీ పొందవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ ఓ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. https://indirammaindlu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లికేషన్ సెర్చ్‌పై క్లిక్ చేయాలి. అక్కడ ఆధార్ నంబర్/ మొబైల్ నంబర్/రేషన్ కార్డు నంబర్ ఎంటర్ చేస్తే అప్లికేషన్ స్టేటస్ వివరాలు కనిపిస్తాయి. సర్వే కంప్లీట్ అయిందా? ఎన్నో లిస్ట్‌లో ఉంది. వంటి వివరాలు వస్తాయి. దరఖాస్తుదారులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైజ్ గ్రీవెన్స్ పై క్లిక్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

## హాజీ ఐపీఏ పేరుతో బీర్ టిన్లపై మహాత్మాగాంధీ ఫోటో

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): మద్యం, మాంసానికి దూరంగా ఉండాలని జీవితాంతం పోరాటం చేసిన మన జాతిపిత మహాత్మా గాంధీకి ఘోర అవమానం జరిగింది. ఏ మద్యపాన నిషేధం కోసం పోరాటం చేశారో అదే మద్యాన్ని తన ఫోటోలతో విక్రయించడం కలకలం రేపుతున్నది. ఓ రష్యన్ బేవరేజ్ కంపెనీ బరితెగింపుపై తాజాగా సోషల్ మీడియాలో వివాదం రేగింది. రష్యన్ కు చెందిన రివోర్ట్ కంపెనీ హాజీ ఐపీఏ పేరుతో బీర్ టిన్లను విక్రయిస్తోంది. అయితే ఆ బీర్ టిన్ల పై తాజాగా మహాత్మాగాంధీ ఫోటోతో పాటు ఆయన పేరు చివరకు ఆయన సంతకాన్ని కూడా ముద్రించి అమ్ముతోంది. ఇందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీంతో సదరు కంపెనీ తీరుపై భారతీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యపానానికి దూరంగా ఉండాలని ప్రచారం చేసిన వ్యక్తి ఫోటోను బీర్ల విక్రయాల కోసం ఎలా ముద్రిస్తారంటూ మండిపడుతున్నారు.

**ప్రధానికి సీఎం మనవడు ఫిర్యాదు:**

ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో దుమారం చెలరేగడంతో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నందిని సత్పతి మనవడు సువర్ణో సత్పతి ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ దృష్టికి తీసుకువెళ్లారు. మోడీ ఈ విషయాన్ని తన స్నేహితుడైన రష్యా అధ్యక్షుడితో చర్చించాలని కోరారు. కాగా రివోర్ట్ కేవలం గాంధీజీ ఫోటోలతో మాత్రమే కాకుండా మదర్ థెరిసా, నెల్సన్ మండెలా మార్టిన్ లూథర్ కింగ్ వంటి ప్రపంచ స్థాయి నేతల పేర్లతో బీర్లను ఉత్పత్తి చేసినట్లు తెలుస్తోంది.


## యాదగిరిగుట్ట స్వర్ణ గోపుర సంప్రోక్షణకు సన్నాహాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభ సంప్రోక్షణకు సన్నాహాలు షురూ అయ్యాయి. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా 'పంచకుండాత్మక సుదర్శన నృసింహ మహాయాగం నిర్వహించడానికి కొండపైన ప్రధానాలయ ఈశాన్య దిశలో యాగశాల ఏర్పాటు చేశారు. ఇక ఈ నెల 23న స్వర్ణమయమైన దివ్యవిమాన గోపురానికి పవిత్ర నదీ జలాలతో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం దివ్యవిమాన గోపురంపై ఉన్న సుదర్శన నారసింహ చక్రానికి సంప్రోక్షణ పూజలు చేసి స్వర్ణ విమాన గోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నారు. 23న నిర్వహించే మహాకుంభ సంప్రోక్షణకు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే పంచకుండాత్మక మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో సామాన్య భక్తులు సైతం పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు.

## 2008 డీఎస్సీ బాధితులకు "కాంట్రాక్టు" టీచర్ ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1382 మందికి కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం కల్పిస్తూ స్కూల్‌ఎడ్యుకేషన్‌డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరి కాంట్రాక్టు విధానంలో ప్రతి నెల రూ.31040 వేతనంలో నియమించనున్నట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి సర్వీసు ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం చివరి రోజును ముగిసి తదుపరి విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విద్యాశాఖ అవసరాలకు అనుగుణంగా నియామకం చేసుకుంటారు. వీరికి ఉద్యోగాలు కల్పించనున్నట్లుగా కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. వీరికి ఉద్యోగాలు కాంట్రాక్టు విధానంలో ఇవ్వాలంటూ ప్రభుత్వం క్యాబినెట్ లో నిర్ణయం తీసుకున్నది. దానికి అనుగుణంగా పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వీరు ఎన్ని సార్లు వేడుకున్న స్పందించలేదు. దీంతో వీరు కోర్టును ఆశ్రయించారు. వీరికి ఉద్యోగాల ఉత్వర్వులు ఇవ్వాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



## ట్రిపుల్ఆర్ నిర్మాణానికి టెండర్ దాఖలు గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ఆర్) నార్త్ పార్ట్ నిర్మాణానికి టెండర్ దాఖలు గడువును ఈ నెల 23 వరకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఏఐ) పొడిగించింది. వాస్తవానికి టెండర్ దాఖలు గడువు శుక్రవారంతోనే ముగియగా మరో 9 రోజులు పెంచింది. అదే రోజు టెండర్లను ఓపెన్ చేయనున్నారు. 161.518 కిలోమీటర్ల ఈ రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు.




**ప్యాకేజీ.. పనుల వివరాలు**

1వ ప్యాకేజీ: గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ. 1529.19 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు మొయింటెనెన్స్ చేయాలి.

2వ ప్యాకేజీ: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్ల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1114.80 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మొయింటెనెన్స్ చేయాలి.


3వ ప్యాకేజీ: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1184.81 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి.

4వ ప్యాకేజీ: ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని - 1728.22 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మొయింటెనెన్స్ చేయాలి.

5వ ప్యాకేజీ: రాయగిరి నుంచి తంగడ్ పల్లి వరకు 35 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1547.04 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి.

## హైదరాబాద్‌లో మెట్రో రైల్ విస్తరణ కార్యక్రమాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షను నెరవేర్చే దిశగా మెట్రో రైల్ విస్తరణ కార్యక్రమాలను చేపడుతున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. పర్యావరణ హితంగా హైదరాబాద్ ఉండాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసి) గ్రీన్ తెలంగాణ సమ్మిట్ 2025లో భాగంగా శనివారం (ఫిబ్రవరి 15) జరిగిన గ్రీన్ క్రూసేడర్స్ కార్యక్రమంలో ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూంమేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మార్గాల్లో రాబోయే మెట్రో కారిడార్లకుసంబంధించి డీపీఆర్ మార్చి నెలకల్లా సిద్ధం చేసి కేంద్రానికి పంపుతామని వెల్లడించారు. కొత్త మెట్రో మార్గాలు హైదరాబాద్ రూపురేఖలనే మార్చి వేస్తాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ నాలుగు వైపులా మెట్రో రైల్ నడపాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకూ అనుగుణంగా తగిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఈ అభివృద్ధి ద్వారా హైదరాబాద్ అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన హరిత నగరంగా మారబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్లో పలు ప్రాజెక్టులు హరితమయంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఐజీబీసీలలో గ్రీన్ క్రూసేడర్స్‌గా నమోదు చేసుకున్న వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు నమోదు పాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలోఐజీబీసి నేషనల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, హైదరాబాద్ చైర్మన్ జి.శ్రీనివాస మూర్తి, క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ వి.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

తనకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టం చేశారు. గ్యాప్ ఉన్నట్లు విపక్ష నేతలే క్రియేట్ చేశారని అవన్నీ ఊహాగానాలే అని అన్నారు. రాహుల్ గాంధీ గైడెన్స్‌తోనే పనిచేస్తున్నట్లు తెలిపారు. రాహుల్ ఎజెండాను ముఖ్యమంత్రిగా నెరవేర్చడమే నా పని అని వెల్లడించారు. దేశంలో ఎవరూ చేయలేని విధంగా బీసీ కులగనన చేశాం. మిస్ అయిన వారి కోసం మరోసారి కులగణన చేస్తున్నాం. జనం స్వయంగా చెప్పిన వివరాలే రికార్డుల్లో నమోదు చేశాం. కులగణనలో ఒక్క తప్పు ఉన్నా చూపించండి అని విపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కి 150 ఇళ్ళు కేటాయించినట్లు చెప్పారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో 4 కేటగిరీలు మాత్రమే చూపారు. అందులో బీసీలు 51% శాతం, ఎస్సీలు 18%, ఎస్టీలు 10% శాతం, మిగతావాళ్ళు 'ఓసీ'లుగా చూపారని అన్నారు. తాము చేసిన సర్వేలో మొత్తం 5 కేటగిరీలుగా విభజించి, ముస్లింలలో ఉన్న బీసీలను కూడా కలిపి చెప్పామని స్పష్టం చేశారు. ఆ ప్రకారం హిందూ, ముస్లిం బీసీలంతా కలిసి 56% అయ్యారని అన్నారు. 42% బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చి, పార్లమెంట్ ఆమోదానికి పంపిస్తాం. రాజకీయ జోక్యానికి తావులేకుండా కమిషన్ ద్వారానే ప్రాసెస్ చేస్తున్నాం. కేసీఆర్ సర్వేలో ఎస్సీలు 82 కులాలుగా చూపారు. కానీ ఉన్నవి 59 కులాలే అని చెప్పారు. స్పెల్లింగ్ తప్పుగా ఎంట్రీ అయినా దాన్ని మరో కులంగా చూపారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నేను పట్టించుకోను. మోడీ క్యాస్ట్ విషయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పిన తేదీనే తాను అంగీకరిస్తున్నాను' అని అన్నారు. అంతకుముందు సోనియా, రాహుల్ గాంధీలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యవర్గంపై చర్చించలేదని స్పష్టం చేశారు.

## డ్రోన్లు యుద్ధరంగాన్ని విప్లవాత్మకంగా మార్చేశాయ్

మొదటి పేజీ తరువాయి

అంశాలపై తన అభిప్రాయాలను వివరిస్తూ రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. బ్యాటరీలు, మోటార్లు, ఆప్టిక్స్ కలిపి డ్రోన్ లను అనూహ్యమైన రీతిలో కదిలించేందుకు, కమ్యూనికేట్ చేసేందుకు సహాయపడుతున్నాయన్నారు. కానీ డ్రోన్లు ఒకే ఒక్క టెక్నాలజీ కావని ఇవి ఒక బలమైన పారిశ్రామిక వ్యవస్థ ద్వారా పుట్టుకొచ్చిన క్రియాశీల ఆవిష్కరణలన్నారు. డ్రోన్ల ఉత్పత్తి ఓ నూతన పారిశ్రామిక విప్లవమని రాహుల్ వివరించారు. డ్రోన్ల తయారీతో ముడిపడిన ఇతర రంగాల అభివృద్ధికి చాల అవకాశాలున్నాయన్నారు. యుద్ధరంగంతో పాటు ఇతర సేవా రంగాల్లో, వ్యవసాయ రంగాల్లో డ్రోన్ల ప్రాధాన్యత పెరిగిపోతుందన్నారు. టెలిప్రమోటర్ పై ఏఐ గురించి ప్రసంగాలు చేయడం తప్ప దురదృష్టవశాత్తూ ప్రధాని మోడీ దీని ప్రాముఖ్యతను ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదని రాహుల్ గాంధీ విమర్శించారు. అసలైన టెక్నాలజీ అభివృద్ధిలో మన ప్రస్తుత పోటీదారులు ముందుకు సాగుతున్నారని మాటలు కాదు, దేశానికి బలమైన ఉత్పాదనా స్థావరం అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో అపారమైన ప్రతిభ, విశాలమైన స్థాయి, అభివృద్ధి దిశలో ఉన్న ప్రేరణ ఉందన్నారు. మన యువతకు ఉద్యోగావకాశాలు అందించడానికి, దేశాన్ని భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్లడానికి మనం స్పష్టమైన దృక్పథంతో నిజమైన పారిశ్రామిక శక్తిని నిర్మించాలన్నారు. ఇందుకోసం డ్రోన్ల తయారీ రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరముందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఓరకంగా చెప్పాలంటే డ్రోన్ల తయారీ ప్రక్రియ పారిశ్రామిక ప్రగతికి, ఉపాధి కల్పనకు, శాస్త్ర, సాంకేతి రంగాల అభివృద్ధికి గేమ్ ఛేంజర్ మైలురాయిగా రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనడం దారుణం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46 శాతం ఉన్నారని, రీసర్వే చేయడంతో మరో 1.5 లేదా 2 శాతం బీసీల జనాభా పెరుగుతుందని తెలిపారు. అంటే మొత్తం బీసీల జనాభా దాదాపు 48 శాతం ఉంటుందని అంచనా వేశారు. 48 శాతం బీసీలు ఉంటే ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారు? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఈ మూడు రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ ఒక్క అంశంపై అయినా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం బిల్లు చెల్లకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు రంగాలకు సంబంధించి వేర్వేరు బిల్లులను పెట్టాలని డిమాండ్ చేశారు. ముస్లీంలు, బీసీలకు కలిపి మొత్తం 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింలకు మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ముస్లీంల జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్లు కల్పించాలని, ముస్లీంల పేరు చెప్పి ఆయా వర్గాల మధ్య పంచాయతీ పెట్టవద్దని సూచించారు. గ్రామాల వారీగా ఏ కులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం బయటపెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఇప్పటి వరకు ప్రభుత్వం బయపెట్టలేదని, దాన్ని కూడా వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా లెక్కలు సరైనవా కావా అన్నది ప్రజలు తెల్చుకోగలుగుతారని తెలిపారు. సర్వే లో పాల్గొని వారికి మరోసారి అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, రీసర్వేకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని, టోల్ ఫ్రీ నెంబరులో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని, అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ పదవుల్లో బీసీలకు 51 శాతం అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తు చేశారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే ద్వారా తేలిన జనాభా ప్రకారం నిధులు ఖర్చు చేసుకున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ ఉంటే అభివృద్ధిలో భారత్ ఎప్పుడో అమెరికాను దాటిపోయేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం కోసం పోరాటం చేస్తుందని, సామాజిక దృక్పథంతో పనిచేస్తున్న సంస్థ తెలంగాణ జాగృతి అని చెప్పారు. జాగృతి పోరాటాల వల్లనే అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, బతుకమ్మ పండగకు రాష్ట్ర హోదా సాధ్యమయ్యిందని గుర్తు చేశారు.

# పాఠశాలల్లో సదుపాయాలు కల్పన చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): పిఎం శ్రీ పథకానికి ఎంపిక చేసిన పాఠశాలల్లో సదుపాయాలు కల్పన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారులతో పిఎం శ్రీ నిధులు వినియోగం, సమగ్ర శిక్షా నిధులు ఖర్చులు, 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన, ఆపార్ నమోదు, డిఎస్సీ 2008 అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం శ్రీ పథకం క్రింద జిల్లాలోని టీఎస్ ఎంఎస్ మల్హర్, జడ్పిహెచ్ఎస్ టేకుమట్ల, కాళేశ్వరం, గొల్లబుద్దారం, చెల్పూర్, టీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఎస్ చిట్యాల, టిఎస్ ఎంఎస్ ఘన్‌పూర్, ఎంపిపిఎస్ యమన్‌పల్లి పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు. పిఎం శ్రీలో ఎంపిక చేసిన ఎనిమిది పాఠశాలలకు 73,76,640 రూపాయల నిధులు కాగా ఇప్పటి వరకు 49,29,356 రూపాయలు ఖర్చు చేశారని, మిగిలిన నిధులలో నిర్దేశించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో మంజూరు చేసిన నిధులు వినియోగం అయితేనే రెండో విడత నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. పిఎం శ్రీ నిధుల పర్యవేక్షణకు ఎం ఈ ఓ లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని, ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు, కంపోస్టు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహణ, సోలార్ విద్యుత్తు, గ్రీన్ పాఠశాలలు, ఏకో పార్కు, చారిత్రక ప్రాంతాలకు విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు వివిధ అంశాలలో క్రీడలు, వ్యాసరచన వంటి పోటీలు నిర్బహించి బహుమతులు అందచేయాలని సూచించారు. పిఎం శ్రీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలతో డాక్యూమెంట్ తయారు చేయాలని అన్నారు. బాలికలకు స్వీయ రక్షణ కార్యక్రమాలు.నిర్బహించాలని, అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో అత్యవసర సేవల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆటలు ఆడించాలని, అందుకు కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని అన్నారు. యు డైస్ నమోదులో జాప్యం జరగొద్దని ఆదేశించారు. ఉన్నతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 10 తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. సమయం ఉన్నందున సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని తెలిపారు. నమూనా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు అంటే భయం పోగొట్టాలని అన్నారు. డిఎస్సి 2008 లో ఎంపికైన అభ్యర్థులు జిల్లాలో 43 మంది ఉన్నారని, వారందరి విద్యార్హతలు పరిశీలించి, ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా పకడ్బందీగా నియామకాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల నమోదు ఆపార్ ప్రక్రియ 58 శాతం పూర్తి అయిందని మిగిలిన శాతం పూర్తి చేసిన నూరు శాతం నామోదు పూర్తి చేయాలని ఆదేశించారు. పిఎం శ్రీ క్రింద ఎంపిక చేసిన పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పిఎం శ్రీ పథక లక్ష్య సాధనకు కృషి చేయాలని స్పష్టం చేశారు. పథక సమాచారం ఎప్పటికప్పుడు అందించడానికి వీలుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ లతో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు. పాఠశాలల్లో పచ్చదనం పెంపుకు విరివిగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వర్షపు నీరును భూమిలోకి ఇంకింప చేయు కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎఫ్ఏఓ కార్తీక్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ హాస్టల్ సందర్శించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): మహాత్మ జ్యోతి రావు పూలె, గిరిజన సంక్షేమ హాస్టల్ సందర్శించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతి రావు పూలె, గిరిజన సంక్షేమ హాస్టల్ ను కలెక్టర్ శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో సందర్శించి పరిశీలించారు. ముందుగా మహాత్మ జ్యోతి రావు పూలె హాస్టల్ లోని డైనింగ్ హాల్ ను వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని అడిగి తెలుసుకున్నారు, అక్కేడే వున్న 10వ తరగతి విద్యార్థి శశి మానేంద్ర ను సాయంత్రం అందించే స్నాక్స్ ఆహారం, చదువు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన సంక్షేమ హాస్టల్ బాయ్స్ ను సందర్శించారు, డైనింగ్ హాల్ ను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ తెలుసుకున్నారు. టాయిలెట్లు, చేతులు కడిగే పంపు వద్ద వున్న అపరిశుభ్రమైనా వాతావరణం వెంటనే తొలగించాలాన్నారు.
పదవ తరగతి విద్యార్థులు,ప్రభాస్ పవన్ కళ్యాణ్, చరణ్ సాయిలతో మాట్లాడుతూ హాస్టల్ లో కల్పిస్తున్న సదుపాయాలపై, వారికి అందుతున్న ఆహారం,విద్య పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలలోని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. షెడ్యూలు ప్రకారం విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.
ప్రతి సబ్జెక్టు వారిగా ఉత్తమ ఫలితాలు సాధించుటకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత వసతి గృహాల ప్రిన్సిపల్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**





హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినుల భోజనానికి సంబంధించిన మెనూ పట్టికను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందిస్తున్నారా అని పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు బాగా చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ కే. నారాయణ, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

# ఏటూరునాగారం కేంద్రంలో ఎస్సీ, బీసీ ఎస్ఎంఎస్ హాస్టల్ ని ఏర్పాటు చేయాలి

**ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా అధ్యక్షులు జాగటి రవితేజ**




ఏటూర్ నాగారం, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షతన బట్ట స్వామి వహించాడు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ మలుగు జిల్లా నూతన అధ్యక్షులు జాగటి రవితేజ గారు హాజరై మాట్లాడుతూ ఎటునాగారం డివిజన్ కేంద్రంలో ఆరు మండలాలు ఉన్నాయి మండలంలో ఉన్నటువంటి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం లేక అదే విధంగా డివిజన్ కేంద్రంలో, ప్రభుత్వ జూనియర్,డిగ్రీ, ఐటిఐ కళాశాలలు ఉన్నా గాని విద్యార్థులకు ఎస్ఎంఎస్ హాస్టల్ లేనటువంటి పరిస్థితి ఉన్నది పూర్తిస్థాయిలో విద్య అందలేక పేద మధ్యతరగతి విద్యార్థులు చదువు దూరమవుతున్న అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలని అదేవిధంగా అధికారులు స్పందించి ఈ యొక్క సమస్యల పైన పరిష్కరించాలని హాస్టల్లో కూడా ఏర్పాటు చేయాలని వారు అన్నారు. లేని ఎడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బట్ట స్వామి, డివిజన్ కమిటీ సభ్యులు నర్సింగరావు, వెంకటేష్ పాల్గొన్నారు

# రేడియో కిసాన్ దినోత్సవంలో సన్మానించిన అధికారులు శాస్త్రవేత్తలు




హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): రేడియో కిసాన్ దినోత్సవం పురస్కరించుకొని ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో శనివారం ఉదయం ఆదర్శ రైతుల సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి అనురాధ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ దిలీప్, మున్సిపల్ శాఖ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి కమలాకర్ పాల్గొన్నారు. ఆకాశవాణిలో రైతు సోదరుల కోసం ఉద్దేశించిన కిసాన్ వాణి కార్యక్రమాలు ప్రారంభమైన రోజుని కిసాన్ దినోత్సవంగా పరిగణిస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన రేడియో కిసాన్ దినోత్సవంగా ఆకాశవాణి జరుపుకుంతుంది. ఈ సందర్భంగా పూర్వపు వరంగల్ జిల్లా నలుమూలల నుంచి అభ్యుదయ రైతులలో కొందరిని ఎంపిక చేసి పదిమంది ఉత్తమ వ్యవసాయదారులుగా గుర్తించి ఘనంగా సత్కరించుకున్నది. వీరిలో మహిళా రైతుల కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీమతి అనురాధ మాట్లాడుతూ తాము క్షేత్ర పర్యటనలకు వెళ్ళినప్పుడు లభిస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకొని అనేకమంది రైతు సోదరులు రేడియో వల్ల ప్రయోజనం పొందుతున్నారని తెలియజేశారు. గ్రామాలలో చాలామంది వ్యవసాయదారులు రేడియోని కుటుంబ సభ్యులలో భాగంగా పరిగణించటం ఆవిడ గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని ప్రతి ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేసినా కొత్త వంగడాల వివరాలని వ్యవసాయంలో అనుసరించాల్సిన మెలకువలని చేరవేయడంలో ఆకాశవాణి సంపూర్ణంగా తమ పాత్ర నిర్వహిస్తున్నదనీ పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ దిలీప్ మాట్లాడుతూ ఎన్ని చైతన్య యాత్రలు ఎవరు నిర్వహించిన వ్యవసాయం కోసం ఆకాశవాణి నిర్వహించే పాత్ర సమున్నతమైనదని అన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలతో ఆకాశవాణి కి గల అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మునిసిపల్ శాఖ ముఖ్య ఉద్యాన శాఖ అధికారి శ్రీ రమేష్ వ్యవసాయం అనేది ఒక తృప్తితో కూడిన కళాత్మకమైన జీవన విధానం అభి వర్ణించారు. మార్పును స్వీకరిస్తేనే మనుగడ సాధ్యమవుతుందని ఈ సందర్భంగా రైతు సోదరులకు సూచించారు. హరిత విప్లవ ప్రయోజనాలని రైతు సోదరులకు చేరవేయడంలో ఆకాశవాణి పాత్ర గణనీయమైనదని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి కమలాకర్ ఒక సినిమా పాటను ఉదహరించి సభను రంజింప చేశారు. రైతు సోదరులు వివిధ పంటలు సాగు చేసే సమయంలో ఏ ఏ దశలలో ఎట్లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే సమాచారాన్ని చేరవేయడంలో ఆకాశవాణి సమర్థవంతంగా కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. తన బాల్యంలో గ్రామపంచాయతీ రేడియో నిర్వహించిన పాత్రని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో పలువురు రైతు సోదరులు అడిగిన సందేహాలకు జిల్లా అధికారులు తగిన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి కిసాన్ వాణి విభాగం అధికారి బొంపల్లి నరేష్ కుమార్ తొలిపలుకలతో ప్రారంభం కాగా ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్ మలి పలుకులతో ముందుకు సాగింది. విద్యా వినోదం వ్యవసాయం సమపాళ్ళుగా అందించిన ఆకాశవాణి ఎప్పుడూ కూడా వ్యవసాయ కార్యక్రమాల కోసం తొలి ప్రాముఖ్యతనిస్తుంది అని తెలియజేశారు. అడవి రాజబాబు కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించి సభను ఆద్యంతం ఆసక్తికరంగా నిర్వహించారు. కిసాన్ వాణి కార్యక్రమాలను సమర్పించే వ్యాఖ్యాతలు డాక్టర్ పశుల ఎల్లయ్య, చిరంజీవి, ఆర్షం సదానందం, పంకజ్ మోహన్ లను కూడా ఈ సందర్భంగా ఆకాశవాణి ఘనంగా సత్కరించింది. యాద ఉషశ్రీ వందన సమర్పణతో సభ సంపన్నమయింది. ఈ రేడియో కిసాన్ దినోత్సవ వేడుకలో ఆకాశవాణి సిబ్బంది శివశంకర్, శ్రీనివాసాచార్య, వెంకటరమణ, శ్రీనివాసరాజు, ఉషశ్రీ, రామమూర్తి, విజయలక్ష్మి, రామ మోహన్, చందు, స్వప్న, రమేష్, మొగిలి, సుధాకర్, అశోక్, ఎలిషా, సరిత, అనిల్ ప్రసాద్, పరాంకుశం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సమావేశాలు దిక్సూచిగా నిలుస్తాయి

**జిల్లా కలెక్టర్ డా.సత్య శారద**

**ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్**

**విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలెక్టర్ చిట్ చాట్**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు దిక్సూచిగా నిలుస్తాయని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అభిప్రాయపడ్డారు. శనివారం వరంగల్ నగరంలోని ఎల్ బి నగర్ లో గల మాసుం అలీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో నిర్వహించిన పేరెంట్స్ సమావేశం లో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు వారి తల్లిదండ్రులలో కలెక్టర్ చిట్ చాట్ నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 125 పాఠశాలల్లో శనివారం విద్యార్థి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం పాఠశాల పటిష్టతకు విద్యార్థి వికాసానికి సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్థాయని, ఇలాంటి సమావేశాలు విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారధిని నిలుస్తాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల చదువు ప్రవర్తన క్రమశిక్షణ తల్లిదండ్రులు తెలుసుకోవచ్చునని అన్నారు. పిల్లల విద్యా విధాన తీరు పై వారం లో ఒకసారి అయినా సమీక్షించాలని, పిల్లల విద్య సంబంధిత అంశాలపై ఆయా సబ్జెక్టులు బోధించే టీచర్లతో చర్చించాలని కలెక్టర్ అన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణను అవలంబిస్తే విద్య తానంతట అదే వస్తుందని, విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన ఎంత అవసరమో తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా అంతే అవసరమని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు వారి నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరుపై కలెక్టర్ అడిగి తెలుసుకునే క్రమం లో బాగుందని విద్యార్థులు తల్లిదండ్రులు తెలుపగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు

# రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ

**ప్రజలు సహకరించాలి : ఈడీఎం ప్రశాంత్**





మహబూబాబాద్, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): కొత్త రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ అని ప్రజలు సహకరించాలని ఈడీఎం ప్రశాంత్ అన్నారు. ఈఎస్డి కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు కొత్తగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డ్ సేవ మరియు మీ సేవ కేంద్రాల పనితీరును పరిశీలించడానికి శనివారం ఈ డిస్టిక్ మేనేజర్ ప్రశాంత్, టీజీటీఎస్ డి ఎం రఘుపతి మహబూబాబాద్ మున్సిపాలిటీ కేంద్రం వద్ద గల ప్రభుత్వ ఈసేవ సెంటర్ ను, బయ్యారం మండలంలోని మీ సేవా కేంద్రాలను, ఆధార్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మీసేవ ఆపరేటర్లందరూ వివిధ అవసరాల కోసం మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజల వద్ద నుండి అదనపు రుసుములు వసూలు చేయకూడదని, మీసేవ కేంద్రానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మీసేవ కేంద్రాలలో ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1100 కి ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వారు మీ సేవ కేంద్రాల్లో ప్రజలతో కొత్త రేషన్ కార్డులు మరియు రేషన్ కార్డుల్లో సవరణలు నిరంతర ప్రక్రియ అని అందరూ సహకరించాలని కోరారు.

# రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ, ప్రజలు సహకరించాలి

**ఈడీఎం సైదేశ్వర రావు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): కొత్త రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ అని ప్రజలు సహకరించాలని ఈడీఎం సైదేశ్వర రావు అన్నారు. ఈఎస్డి కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు కొత్తగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డ్ సేవ మరియు మీ సేవ కేంద్రాల పనితీరును పరిశీలించడానికి శనివారం ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, టీజీటీఎస్ డి ఎం రఘు పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మీసేవ ఆపరేటర్లందరూ వివిధ అవసరాల కోసం మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజల వద్ద నుండి అదనపు రుసుములు వసూలు చేయకూడదని, మీసేవ కేంద్రానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మీసేవ కేంద్రాలలో ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1100 కి ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వారు మీ సేవ కేంద్రాల్లో ప్రజలతో కొత్త రేషన్ కార్డులు మరియు రేషన్ కార్డుల్లో సవరణలు నిరంతర ప్రక్రియ అని అందరూ సహకరించాలని కోరారు.

# పెద్దగట్టుకు ఊరేగింపుగా తరలిన మకర తోరణం







సూర్యాపేట, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): రోజులపాటు జరగనున్న పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర మహోత్సవానికి శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గొల్ల బజార్ నుంచి స్వామివారి మకర తోరణం భారీ ఊరేగింపుతో డప్పుల మోతల నడుమ పెద్దగట్టుకు తరలి వెళ్ళింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేనారెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర 16 నుండి ఐదు రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగే పెద్దగట్టు జాతరను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ప్రజలకు భక్తులకు జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో జాతరను నిర్వహించి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా భాస్వరంను కరిగించు బాక్టీరియాను రైతులకు పంపిని



కన్నాయి గూడెం, ఫిబ్రవరి 15 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టెవుల, బుట్టయి గూడెం గ్రామ రైతులకు మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం, పప్పు దినుసుల విభాగంలో ఉచితంగా యాబై కిలోల భాస్వరంను కరిగించి ఇచ్చు బాక్టీరియాను రైతులకు పంపిని చేయడం జరిగింది. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ బాక్టీరియా భూమి పొరల్లో స్థిర పడిన భాస్వరాని కరిగించి మొక్కలకు అందించి, మొక్కల వేరు వ్యవస్థ ను పెంపొదించి, అధిక మొత్తం లో నేల లోని పోషకాలను తీసుకొని మొక్క ఎదుగుదలకు ఉపయోగ పడుతుంది అని తెలిపినారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.




# ప్రైవేటు దోపిడీ

"ఇందుగలడందు లేదను" నట్లు దోపిడీ చేయనటువంటి స్థలం ఎక్కడా లేదు మన దేశంలో. ప్రైవేటు విద్యాలయాల్లో దోపిడీ.. ప్రైవేటు వైద్యశాలల్లో దోపిడీ.. ప్రైవేటు వ్యాపార సంస్థల దోపిడి.. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ.. అన్ని ప్రార్థన స్థలాల్లో దోపిడీ.. దోపిడీ.. ఎటు చూసినా దోపిడీ.



## పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు

## ప్రైవేట్ విద్యాలయాల దోపిడీ

పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు ప్రజలను విపరీతంగా దోచుకుంటున్నాయి. శిశు తరగతికి లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారంటే ఇది మామూలు దోపిడీ కాదు. అక్షరాలు (ఏ బి సి డి) నేర్పడానికి లక్ష రూపాయలు ఖర్చు పెట్టాలంటే మధ్యతరగతి వారికి కష్ట సాధ్యం. పేదవారికి మరీ ఇబ్బంది కరం. పేదవారు లక్ష రూపాయలు చూడడమే గగనం. పిల్లవాడికి ఫీజు కట్టాలంటే వారికి చాలా కష్టం అవుతుంది. లక్ష రూపాయలు కేవలం అందులో చేరడానికి మాత్రమే. మిగతా నెల ఫీజు అని మెయింట్ నెన్స్ ఫీజు ఇలా రకరకాల ఫీజులు వసూలు చేస్తుంటారు. ఇక పేదవారు ఆ స్కూల్ వైపు చూడడానికే సాహసించరు. ఈ రోజుల్లో చదువు" కొంటున్నా"ము. కూలి పని చేసుకుని బతికే వారికి ఈ స్కూల్లు గగన కుసుమాలే. డిజిటల్ స్కూల్ అని, కాన్సెప్ట్ స్కూల్ అని, రెసిడెన్షియల్ స్కూల్ అని ఇలా రకరకాల పేరులతో పాఠశాలలను స్థాపిస్తున్నారు. ఎవరు చెప్పినా ఏబిసిడిలే కానీ ఫలా నా స్కూల్లో చదివితే ఇంజనీరింగ్ సీటు ఖాయమని మెడిసిన్ సీట్ తప్పనిసరి అని ఢ్డదర గొట్టే పాఠశాలలు కూడా ఉన్నాయి. లక్షలాది రూపాయలు తీసుకొని కూడా పిల్లలకు అన్ని వసతులు కల్పిస్తున్నారంటే ఒక్కొక్క స్కూల్లో అవి కూడా ఉండవు. ప్రజలు ఎక్కడికక్కడ పోనీలే అంటూ తమ పిల్లలు ప్రయోజకులు కావాలని స్కూల్లో చేర్పిస్తున్నారు. ప్రశ్నిస్తే ఆ పిల్లవాడిని ఆ స్కూల్ నుండి పంపిస్తారు ఇంకెక్కడ చేర్చుకోకుండా ఇతర స్కూల్ల యాజమాన్యాలకు కూడా తెలియజేస్తారు. ప్రైవేట్ స్కూల్ల పట్ల ప్రభుత్వాలు చూసి చూడనట్టు ఊరుకుంటున్నాయి. మొక్కుబడిగా ఎప్పుడో ఒకసారి సమావేశాలు జరుపుతారు. కానీ ఫీజుల విషయంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు "తగ్గేదేలే" అంటూ దోపిడీ చేస్తున్నాయి. ప్రైవేటు కాలేజీలు కూడా వీటికి ఏమి తీసిపోవు డొనేషన్ల రూపంలో ఫీజుల రూపంలో మధ్య తరగతి వారి జేబు ఖాళీ చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సీటు లేదు పొమ్మంటారు. పేదవాళ్లు ఫీజులు కట్టలేక పిల్లవాడి చదువును మధ్యలో ఆపేసి ఏదో పనిలో పెడుతూ అలా బ్రతికేస్తున్నారు.

ఇక ప్రభుత్వం వారు పాఠశాలలు, కళాశాలలు స్థాపించి తాము ప్రజలకు ఎంతో చేస్తున్నామని అనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉన్నత విద్యావంతులైన టీచర్లు ఉంటారు కానీ ఒక్కొక్క స్కూలు/కాలేజీ చూస్తే ఉపాధ్యాయులు పాఠాలు చెప్పరు. చాలామంది ప్రైవేట్ ఆదాయ వనరులు కల్పించుకుంటారు. ఇంటి దగ్గర ట్యూషన్ లు చెప్తారు ఇలా ఎందరో ఉపాధ్యాయులు పిల్లలను నిర్లక్ష్యంగా వదిలిపెడతారు. ప్రభుత్వ పాఠశాలలో/కళాశాలలో ఉపాధ్యాయులు తలుచుకుంటే నిజంగా వారి మనసుతో, నీతిగా, న్యాయంగా పాఠాలు బోధిస్తే "రాళ్లు కూడా రత్నాలు అయినట్టు"గా పిల్లలు ఎంత తెలిలేని వారైనను విద్యావంతులు కావడం ఖాయం. ప్రభుత్వ పాఠశాలల్లో సరియైన యాజమాన్యాలు ఉండవు ఉన్న ఒక్క ప్రధాన ఉపాధ్యాయుడు కూడా ఉపాధ్యాయుడే కదా..?

అందుకొరకు ప్రజలు ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించడానికి ఇష్టపడరు. విధి లేని పరిస్థితుల్లో ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి అంతట ఉన్నదని కాదు. కొన్నిచోట్ల ప్రైవేట్ స్కూలు కన్నా మెరుగైన ఫలితాలు సాధించే ప్రభుత్వ పాఠశాలలు కూడా ఉన్నాయి.

### ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీ



ప్రభుత్వము వారు నిర్వహిస్తున్న వైద్యశాలలు తక్కువే ఉన్నా అట్టి చాలా వైద్యశాలల్లో డాక్టర్లు ఉండరు. సరియైన మందులు ఉండవు. బాధతో వచ్చిన ప్రజలను ఓదార్పు నిచ్చే సరియైన వైద్యం చేసే నర్సులు కానీ డాక్టర్లు కానీ ఉండరు. డాక్టర్లు బయట క్లినిక్ లో పనిచేస్తుంటారు లేక తామైనా సొంతంగా క్లినిక్ నడిపించుకుంటూ రెండు చేతుల ప్రభుత్వం వైద్యశాలలో ప్రైవేటు వైద్యశాలలో అందరు ఉన్నా ఒకరిద్దరు నిర్లక్ష్యంగా మాట్లాడడం వచ్చిన వారిని మరింత బాధ పెట్టడం జరుగుతున్నది. అందుకే ప్రజలు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. తాము పైసా పైసా కూడా పెట్టి చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలలకు తమ కష్టార్జితాన్ని ధారపోస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలలో వచ్చిన వారికి మెరుగైన చికిత్సలు చేసి వారి బాధలను తీరుస్తారు. డబ్బులు ఎక్కువగా వసూలు చేస్తారు.

పేదవారని చూడక ప్రైవేట్ వైద్యశాలలు కొన్ని లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. పేదవారు తాము సంపాదించిన ధనమంతయు తమ పిల్లల చదువులకు ఆరోగ్యానికి అధిక మొత్తంలో ఖర్చు పెడుతున్నారు ఇది వారికి తలకు మించిన భారమవుతున్నది. ఎంత కష్టపడ్డను ఎంత శ్రమకోర్చినను పేదవారు పేదవారిగానే ఉండిపోవుటకు ఇది ఇది కూడా ఒక కారణమే. ప్రభుత్వాలు తమ బడ్జెట్లో విద్య వైద్యం కోసం కేటాయింపులు తక్కువగా ఉంటాయి. ప్రజలు డాక్టర్ల నిష్పత్తిని చూస్తే డాక్టర్లు చాలా తక్కువగా ఉన్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు ఉండవు. చికిత్స కోసం కొన్ని కిలోమీటర్లు వెళ్ల వలసి ఉంటుంది. ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలు పేదవారని కూడా చూడకుండా లక్షలాది రూపాయల ఫీజును జలగల్లా పట్టి పీలుస్తున్నారు. ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. చాలామందిలో మానవత్వం నీతి న్యాయం ఉండవు డబ్బు సంపాదనమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుంటారు. రోగి చనిపోయిన కూడా ఆ విషయం రోగి బంధువులకు తెలుపకుండా రెండు మూడు రోజులు ట్రీట్మెంట్ పేరుతో కాలయాపన చేసి చివరకు చనిపోయాడని చెప్తున్నారు. అలాంటి వైద్యశాలను కూడా మనం చూస్తున్నాం ఏ చికిత్స చేయకుండా లక్షలాది రూపాయలు కట్టమని లేకుంటే శవం ఇవ్వమని చెబుతున్నారు వీరిని రాక్షసులు అనాలా? పిశాచాలు అనాలా? తెలుగు భాషలో వీరికి సంబంధించిన పదాలు దొరకడం లేదు. ప్రభుత్వాలు, ప్రైవేటు విద్యా వైద్యశాలలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు విద్యాలయాలను వైద్యశాలలను బలోపేతం చేసి ప్రైవేటు పాఠశాల లను వైద్యశాలలను లేకుండా ప్రభుత్వమే విద్య వైద్యం ఉచితం చేయాలి. ప్రభుత్వాలు ఇచ్చే ఉచితాలు ప్రజలను పరాన బుక్కులుగా తయారు చేస్తాయని ఈ మధ్యన సుప్రీంకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది.

అలవి గాని హామీలతో గద్దెనెక్కుతున్న ప్రభుత్వాలు ఉచితాలను ప్రకటించి ప్రజలను సోమరిపోతుల తయారు చేయడమే అవుతుంది కానీ నిజమైన వారికి ఉచితాలు అందడం లేదు. ఉచితాలు అర్హత ఉన్నవారికి ఇవ్వాలి కానీ అందరికీ కాదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి ఉచితాలను తగ్గించి విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యను వైద్యాన్ని ప్రజలందరికీ ఉచితం చేస్తే పేదవారు తగ్గిపోతారు. ప్రజలందరూ సంతోషంగా ఉంటారు అందుకోసం తమ బడ్జెట్లో ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### సైబర్ నేరగాల్ల దోపిడి

ఈ మధ్యన తెలుగు రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్ల దోపిడీ ఎక్కువయింది. మన మొబైల్ కి ఒక లింకు పంపిస్తారు ఆ లింకు టచ్ చేస్తే మన బ్యాంకు కాళీ అవుతుంది. ఇంకొక విధంగా మనకు లోన్ ఇస్తామంటారు ఎలాంటి కాగితాల అవసరం లేదంటారు. ఎలాంటి షూరిటీ అవసరం లేదంటారు. మనిషి ఆశాజీవి ఎలాంటి స్యూరిటీ లేకుండా లోన్ ఇస్తామంటే ఎగిరి గంతేసి తీసుకుంటారు. అప్పటినుండి మొదలవుతుంది వారి టార్చర్ యిన్ని వేలు కట్టాలని ఫోన్ చేస్తారు. సరే అని కట్టేస్తారు ఎన్నిసార్లు కట్టినా ఇంకా మీరు డబ్బులు ఇచ్చేది ఉన్నారని మరల మరల ఫోన్ చేస్తుంటారు. మన బంధువులకు స్నేహితులకు కూడా మన విషయాలు చెప్తారు. తర్వాత మనల్ని నానా బూతు మాటలు తిట్టి డబ్బులు కట్టమంటారు ఆ బూతులు వినలేక ఓర్చుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో మనం విన్నాం ఇక రాత్రిపూట దొంగతనాలు చేసే వారి దొంగతనాలు అదనంగా మనకు బాధను కలిగిస్తుంటాయి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ గా చేసుకొని దొంగలు విజృంభిస్తారు కొన్ని దుకాణాల్లో పనిచేసే వారు కూడా రాత్రిపూట దుకాణానికి కన్నం వేసి బంగారు వస్తువులు ఎత్తుకుపోయిన సంఘటనలు కూడా మనం విన్నాం. ఈ విధంగా ప్రైవేటు దోపిడీ ఇంతింతని చెప్ప లేము. కష్టపలితాన్ని దోచుకొని పోవడానికి ఎన్నో రకాలుగా దోపిడీ మార్గాలు మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి అజాగ్రత్తగా ఉన్నామంటే అంతే సంగతులు ప్రభుత్వం వారు పోలీసులను అలర్ట్ చేసి ప్రజల ధనమానప్రాణాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలి.



### ప్రైవేటు వ్యాపారస్తుల దోపిడీ

ప్రజలకు అవసరమైన వస్తువులను డీ మార్ట్ లాంటి హోల్ సేల్ గా విక్రయించుటకు కొన్ని బడా వ్యాపారులు సంస్థలు నెలకొల్పారు. అందులో బట్టలు అమ్మడానికి షాపింగ్ మాల్స్ పేరుతో హోల్సేల్ వ్యాపారం చేస్తున్నారు. వీరు 50 శాతం రిబేటు అని 80% రిబేటు అని ధర కన్నా రెండింతలు ఎక్కువగా వేసి అమ్ముతున్నారు. కొందరు వ్యాపారస్తులు ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ రెండింటి ధర ఒకే దానికి వేసి అమ్ముతున్నారు ఇలాంటి ట్రిక్కులతో వ్యాపారస్తులు భారీ మోసానికి ఎగబడుతున్నారు. ఇంకా సైబర్ నేరగాళ్లు రాత్రిపూట దొంగతనం చేసే దొంగలు ఇలాంటి వాటి వల్ల కూడా ప్రజలకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి.

అడియాల శంకర్, అధ్యక్షులు
తెలంగాణ హేతువాద సంఘం.

# సెపీ సంరక్షణలోని శత్రు ఆస్తుల లెక్క తెల్చాలి

మొదటి పేజీ తరువాయి

శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఎనిమీ ప్రాపర్టీస్ పై సమీక్ష నిర్వహించడం ఇది రెండోసారి కాగా గత నవంబర్ లో నిర్వహించిన సమీక్ష పురోగతి వివరాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కొత్వాల్ గూడ, మియాపూర్ పరిధిలో ఉన్న వందలాది ఎకరాల ఎనిమి ప్రాపర్టీస్ పై పురోగతి ఏమిటని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని ప్రశ్నించడంతో ఆయన సర్వే నెంబర్ల వారీగా పురోగతిని వివరించారు. కొన్ని స్థలాలు అన్యాక్రాంత మయ్యాయని, మరికొన్ని చోట్ల రైతులు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి పొజిషన్ లో ఉన్న రైతులకు అన్యాయం జరగకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి నెలాఖరులోపూ సర్వే, రికార్డుల పరిశీలన పూర్తి చేసి నివేదిక అందించాలని కోరారు.

హైదరాబాద్, కొత్తగూడెం జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్ పై జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదించండి.

హైదరాబాద్ ని బాకారంలోని 25 వేల 503 గజాల వివాదాస్పద స్థలంలో ఎనిమి ప్రాపర్టీస్ వాటా 5,578 గజాలు ఉందని, ఈ స్థలంలో 20 కుటుంబాలు పొజిషన్ లో ఉంటూ నివాసాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. అలాగే బహదూర్ పురాలోని రికాబ్ గంజ్ లో 710-724, 778 -784 నెంబర్లలో 3300 గజాల ఎనిమీ ప్రాపర్టీ వివాదంలో ఉందని వివరించారు . డీఎస్ డియోదీ గాలిబ్ పేరిట స్థలం ఉందని, ఈ స్థలం సర్వే నెంబర్, లొకేషన్ కూడా ట్రేస్ కావడం లేదన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర సెపీ అధికారులతోపాటు రాష్ట్ర రెవెన్యూ అధికారులు కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కొత్తగూడెంలోని పాల్వంచలోని 126/111, 126/112 సర్వే నెంబర్ లోని 40 ఎకరాల వ్యవసాయ ఎనిమీ ప్రాపర్టీని కొందరు రైతులు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర విభాగమైన కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారులు ఎంక్వైరీ చేసి సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశించారు.




సెక్షన్ 8 ఏ ప్రకారం ఎనిమీ ఆస్తుల వివాదాలను పరిష్కరించండి.

వికారాబాద్ జిల్లాలోని అల్లంపల్లిలోని 426, 427, 428 సర్వే నెంబర్లలోని 17.22 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీస్ లోని వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుభప్రద పటేల్ నూలి కుటుంబ సభ్యులు ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నారని అధికారులు మంత్రికి తెలిపారు. ఇందులో 2.18 ఎకరాలు రైల్వే లైన్ కోసం రైల్వే శాఖ తీసుకుందన్నారు. ఈ స్థల వివాదం కోసం రూల్స్ ఏం చెబుతున్నాయని బండి సంజయ్ సెపీ అధికారులను అడిగారు. సెక్షన్ 8 ఏ ప్రకారం ఎనిమీ ప్రాపర్టీ అని తెలియకుండా కొన్న వాళ్లు, వలస యజమానుల కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న స్థలాల తోపాటు, సెపీ, రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల క్రితం లీజుకిచ్చిన భూములకు సంబంధించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సెపీ అధికారులు తెలిపారు. తక్షణమే సెక్షన్ 8 ఏ ప్రకారం సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు.

త్వరలోనే హైదరాబాద్ లో సెపీ అనుబంధ కార్యాలయం ఏర్పాటు

తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళలో సెపీ అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేసేలా చూస్తామని మంత్రి బండి సంజయ్ తెలిపారు . ప్రస్తుతం ముంబై ఆఫీస్ నుంచి ఆయా రాష్ట్రాల ఎనిమీ ఆస్తులపై పర్యవేక్షిస్తున్నారని , ఇకపై ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ లో సెపీ కార్యాలయ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

### ఎనిమీ ప్రాపర్టీస్ అంటే?

1962లో చైనీస్ దండయాత్ర, 1965 నుండి 1971 వరకు నిర్వహించిన ఇండో-పాక్ యుద్ధం అనంతరం భారత్ నుంచి వెళ్లిపోయి పాకిస్తాన్, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్ లో ఉన్న ఆస్తులను శత్రు(ఎనిమీ ప్రాపర్టీ) ఆస్తులుగా ప్రభుత్వం గుర్తించింది. వీటి సంరక్షణ బాధ్యతలను కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ)కు అప్పగించింది. తెలంగాణ, ఏపీతో పాటు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో దాదాపు 13 వేల వరకు శత్రు ఆస్తులు ఉన్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్ విలువ వేల కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఎనిమీ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 8(ఏ) ప్రకారం ఈ ఆస్తులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉంది. అయితే నాటి నుండి నేటి వరకు ఈ ఆస్తులు చాలా చోట్ల అన్యాక్రాంత మయ్యాయి. మరికొన్ని ఆస్తులకు సంబంధించి న్యాయ వివాదాలు నడుస్తున్నాయి. ఆ ఆస్తుల వివాదాల పరిష్కారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్ష నిర్వహించారు.



## ఎక్స్‌ట్రీమ్‌కు పోటీగా ఏబీఎస్‌తో పల్సర్ ఎన్ఎస్ 125

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో ఏబీఎస్‌తో కూడిన కొత్త పల్సర్ ఎన్ఎస్ 125ను తాజాగా లాంచ్ చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ. 1.01 లక్షలుగా నిర్ణయించింది. హీరో మోటోకార్ప్ తీసుకొచ్చిన ఎక్స్‌ట్రీమ్ 125 మోటార్ సైకిల్‌కు ఇది గట్టి పోటీనివ్వనుంది. ఎక్స్‌ట్రీమ్ సింగిల్ ఛానల్ ఏబీఎస్‌తో వస్తుండగా.. బజాజ్ కూడా సింగిల్ ఛానల్ ఏబీఎస్‌తో ఎన్ఎస్ 125ను తీసుకురావడం గమనార్హం. దీంతో ఈ సెగ్మెంట్‌లో రెండు వాహనాలు పోటీ పడనున్నాయని మార్కెట్ వర్గాల చెబుతున్నాయి. ఏబీఎస్ మినహా ఎన్ఎస్-125లో కొత్తగా ఎలాంటి మార్పులూ చేయలేదు. ఇక పల్సర్ ఎన్ఎస్ 125 విషయానికొస్తే.. 124.45 సీసీ 4 స్ట్రోక్ SOHC 4 వాల్వ్ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్ అమర్చారు. ఇది 11.82 హెచ్‌పీఈ పవర్‌ను 11 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 17 అంగుళాల వీల్స్ ఇచ్చారు. ముందువైపు టెలిస్కోపిక్ ఫోర్క్స్, వెనుక వైపు మోనో సస్పెన్షన్ ఉంది. గేర్ పొజిషన్, యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ, రియల్‌టైమ్ ఫ్యూయల్ ఎకానమీ వంటి వివరాలతో డిస్‌ప్లే ఇచ్చారు. బ్లూటూత్ కనెక్టివిటీ ఉంది. అంటే మీ స్మార్ట్‌ఫోన్‌ను బైక్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. ఈ సెగ్మెంట్‌లో టీవీఎస్ రైడర్, హోండా ఎస్పీ 125 కూడా కొత్త ఎన్ఎస్-125తో పోటీపడనున్నాయి.



## నేనో ఇడియట్‌లా ఫీలయ్యా
### నిఖిల్ కామత్ పోస్టు వైరల్

ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నెట్టింట్లో ఆసక్తికరంగా స్పందించారు. వాలంటైన్స్ డే రోజు పెట్టిన పోస్టు తాజాగా వైరల్ అవుతోంది. "25 ఏళ్లలోపు తెలివైన యువ వ్యాపారవేత్తలతో ఒక రోజంతా గడిపిన తర్వాత కాసేపు నేనో ఇడియట్‌లా ఫీలయ్యా. పొద్దస్తమానం మీటింగ్‌లలో పాల్గొనడం అనవసరం అనిపించింది. ఇలాంటి వ్యక్తులతో ఎక్కువ సమయం ఉంటే చాలా విషయాలు తెలుస్తాయి. ఈ జనరేషన్ చాలా స్మార్ట్. ఈ కొత్త భారత దేశం.. అద్భుతంగా ఉండబోతోంది. హ్యాపీ వాలంటైన్స్ డే" అని నిఖిల్ కామత్ పోస్టు పెట్టారు. కాగా.. జెరోదా వ్యాపార రంగంలోకి దూసుకెళ్తోంది. ఆ సంస్థ మరో సహ వ్యవస్థాకుడు, సోదరుడు నితిన్ కామత్‌తో బంధం గురించి నిఖిల్ ఓ సందర్భంలో వెల్లడించారు. "మేం సోదరులం కావడం మా సంస్థ వృద్ధికి అదనపు ప్రయోజనాన్ని చేకూర్చింది. స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన విషయాలపై నేను ప్రధానంగా దృష్టిసారిస్తా. బ్రోకింగ్ పనులన్నీ నితిన్ చూస్తాడు. అలా ఒకరిదాంట్లో మరొకరం తలదూర్చం. మా మధ్య ఈగో, అపార్థాలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే మేం మొదటినుంచి ప్రతిదాన్నీ పేపర్ మీద పెట్టడం మాకు ఎంతో ఉపయోగపడింది" అని తెలిపారు. అయినా ఇప్పటికీ మా మధ్య విభేదాలు వస్తుంటాయన్నారు. "ఎవరి అభిప్రాయాన్ని వారు గట్టిగా వినిపిస్తాం. కానీ, స్టాక్ మార్కెట్, ట్రేడింగ్, ఇన్వెస్టింగ్ పనుల్లో నా నిర్ణయమే ఫైనల్. ఉత్పత్తులు, బ్రోకింగ్, ప్రజా సంబంధిత విషయాల్లో నితిన్‌దే తుది నిర్ణయం" అంటూ వారిద్దరూ కలిసి సంస్థను నడుపుతోన్న తీరును వివరించారు. గతంలో ఓ సందర్భంలో నితిన్ మాట్లాడుతూ.. "ట్రేడింగ్‌లో నాకంటే నిఖిల్ బెటర్ అనే విషయం నాకు చాలా త్వరగా అర్థమైంది. అందుకే అతడు ట్రేడింగ్, నేను బ్రోకింగ్ వైపు ఉంటే మంచిదని అనుకున్నాం. ఆవిధంగానే కొనసాగుతున్నాం" అని వెల్లడించారు.



## కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**కర్నూలు:** కర్నూలు మెడికల్ కళాశాలలో చదువుదున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాలలోని వసతి గృహంలో శనివారం ఉదయం పురుగుల మందు తాగింది. గమనించిన తోటి విద్యార్థులు యాజమాన్యానికి ఈ విషయాన్ని తెలియజేశారు. ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎస్‌బీఐ గృహ రుణ వినియోగదారులకు గుడ్‌న్యూస్

### తగ్గనున్న ఈఎంఐ

ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ గృహరుణ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను తగ్గించింది. సవరించిన రేట్లు ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. ఎంసీఎల్ఆర్, బీపీఎల్ఆర్ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. గృహ రుణాలకు రెపోరేటును అనుసంధానం చేసేందుకు ఈబీఎల్ఆర్ విధానాన్ని 2019 అక్టోబర్ 1 నుంచి ఎస్‌బీఐ అనుసరిస్తోంది. ఆర్‌బీఐ రెపోరేటు మార్చినప్పుడల్లా ఈ రేటు మారుతూ ఉంటుంది. తాజాగా ఈబీఎల్ఆర్‌ను 9.15 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.90 శాతానికి చేర్చింది. దీంతో ఈబీఎల్ఆర్‌తో అనుసంధానం అయిన హోమ్‌లోన్స్, పర్సనల్ లోన్స్, ఇతర రిటైల్ లోన్స్‌పై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ఆర్‌బీఐ రెపో రేటుకు అనుసంధానం అయిన ఆర్ఎల్ఎల్ఆర్ సైతం 25 బేసిస్ పాయింట్లను ఎస్‌బీఐ తగ్గించి 8.50 శాతానికి తగ్గించింది. దీంతో గృహ రుణాలు, బిజినెస్ రుణాలు ఆ మేరకు తగ్గనున్నాయి.




ఈ రెండు రకాల వడ్డీ రేట్లను ఎస్‌బీఐ తగ్గించిన నేపథ్యంలో ఆయా రుణాలు తీసుకున్న వారికి ప్రయోజనం కలగనుంది. ఆమేర రుణ గ్రహీతలు ఈఎంఐలు గానీ, చెల్లించే కాలవ్యవధిని గానీ తగ్గించుకునే వెసులుబాటు లభిస్తుంది. మరిన్ని వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును సవరించిన నేపథ్యంలో ఇప్పటికే కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా రెపో ఆధారిత రుణ రేట్లను 0.25 శాతం మేర తగ్గించాయి.

# ఏప్రిల్ 2 నుంచి ఆటోమొబైల్ ఉత్పత్తులపై టారిఫ్‌లు : ట్రంప్

పరస్పర పన్నుల విషయంలో వెనక్కి తగ్గబోనని ఇప్పటికే ప్రకటించిన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. దిగుమతి చేసుకొనే కార్లపై సుంకాలు విధించే యోచనలో ఉన్నట్లు శుక్రవారం తెలిపారు. అయితే ఆటోమొబైల్ ఉత్పత్తులన్నింటిపైనా సుంకాలు విధిస్తారా? లేదా అనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఆదాయాన్ని పెంచడానికి, వాణిజ్య అసమతుల్యతను పరిష్కరించడానికి దిగుమతి చేసుకొనే కార్లపై సుంకాలు విధించడం ఓ మార్గమని ట్రంప్ పేర్కొన్నారు. ఏప్రిల్ 2 నుంచి ఆటోమొబైల్ ఉత్పత్తులపై టారిఫ్‌లు ఉండొచ్చని ఆయన తెలిపారు. అయితే దీనిపై పూర్తి వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇదిలాఉండగా.. అమెరికాలో అమ్ముడవుతున్న కార్లలో దాదాపు 50 శాతం దేశంలోనే తయారవుతాయి. ఆటోమొబైల్ ఉత్పత్తుల దిగుమతుల్లో సగం మెక్సికో, కెనడా ఇతర దేశాల నుంచి వస్తున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ నుంచి కొంతమేరకు దిగుమతులు ఉన్నా బ్రిటన్, ఇటలీ, స్వీడన్ నుంచి తక్కువగానే ఆటోమొబైల్ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి.

### టారిఫ్‌ల ప్రభావం మనపై ఎంత?

ట్రంప్ సుంకాల విధింపు విధానంతో ఆటో మొబైల్ పరిశ్రమలో



గందరగోళం ఏర్పడుతోందని ప్రముఖ ఆటో మొబైల్ ఉత్పత్తుల సంస్థ ఫోర్డ్ సీఈవో జిమ్ ఫర్లీ ఇటీవల పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం సుంకాల పెంపు బెదిరింపులు, ఎలక్ట్రిక్ వాహనాలపై ద్వేషం వల్ల చాలా ఖర్చు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అమెరికాలో వాహనాల తయారీకి ప్రాధాన్యం అని ట్రంప్ చెప్పినప్పటికీ టారిఫ్ ప్రణాళిక కారణంగా 'విధాన అనిశ్చితి' నెలకొందని అభిప్రాయపడ్డారు.




# జియో హాట్‌స్టార్‌లో క్రికెట్ మ్యాచ్‌లు..
### ఐపీఎల్‌కు ముందు ఊరట ఉంటుందా?



ఐపీఎల్ సీజన్‌కు ముందు క్రికెట్ ఫ్యాన్స్‌కు జియో హాట్‌స్టార్ షాకిచ్చింది. 2023కు ముందు టీవీ, డిజిటల్ రైట్స్ రెండూ స్టార్ చేతిలో ఉండేవి. 2023లో తొలిసారి డిజిటల్ రైట్స్‌ను దక్కించుకున్న రిలయన్స్ సంస్థ.. జియో సినిమాలో ఉచితంగా మ్యాచ్‌లను ప్రసారం చేయడం మొదలు పెట్టింది. దీంతో గడిచిన రెండేళ్లుగా యూజర్లు దాన్లో ఉచితంగా మ్యాచ్‌లను చూశారు. ఇకపై మాత్రం మ్యాచ్‌లు వీక్షించాలంటే కనీసం రూ. 149 చెల్లించాల్సిందే. అయితే, ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభానికి ముందు జియో నుంచి ఏదైనా మినహాయిపు లేదా ఊరట ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలూ ఉన్నాయి.

### వారికి మాత్రం జియోహాట్‌స్టార్ ఫ్రీ..!

- జియో హాట్‌స్టార్‌లో ఫ్రీ కంటెంట్‌కి కొంత అవకాశముంది. నెలలో నాలుగు గంటల పాటు ఉచితంగా వీక్షించవచ్చు. ఆ నిర్దేశిత గంటలు దాటాక సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది.
- గతంలో డిస్నీ హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతుంది. అంటే హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ముగియడానికి ఇంకా మరో రెండు నెలలు గడువుంటే జియోహాట్‌స్టార్‌లోనూ అదే వ్యాలిడిటీ వర్తిస్తుంది.
- హాట్‌స్టార్ తరహాలోనే ఎవరైనా జియో సినిమా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకుని ఉంటే.. వారు ఆటోమేటిక్‌గా జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌కు మారతారు. ఎన్నాళ్లు మీ సబ్‌స్క్రిప్షన్ ఉంటుందో అన్ని రోజుల పాటు జియో హాట్‌స్టార్ సేవలను ఆనందించొచ్చు.
- జియో, ఎయిర్‌టెల్ ఖాతాదారులు, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు ఎవరైనా ఈ రెండింటి సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉన్నా.. వారు కూడా జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోకుండానే వ్యాలిడిటీ ఉన్నంత వరకు సేవలను ఆనందించొచ్చు. ఒకసారి ఫోన్ నంబర్ లేదా మెయిల్ ఐడీతో జియోహాట్‌స్టార్‌లోకి లాగిన్ అవ్వగానే ఆటోమేటిక్‌గా పాత వ్యాలిడిటీ క్యారీ ఫార్వర్డ్ అవుతుంది.

### ప్లాన్లు ఇవే..

- ప్రకటనలతో కూడిన మొబైల్ ప్లాన్ ప్రారంభ ధర రూ. 149. దీని వ్యాలిడిటీ 3 నెలలు. ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ. 499.
- ండు డివైజ్‌లకు సపోర్ట్ చేసేలా ప్రకటనలతో కూడిన ప్లాన్ రూ. 299. దీని వ్యాలిడిటీ 3 నెలలు. ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ. 899.
- ఎటువంటి యాడ్స్ లేని ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కావాలంటే నెలకు రూ. 299 వెచ్చించాలి. 3 నెలల ప్లాన్ ధర రూ. 499. ఏడాది ప్లాన్ కోసం రూ. 1499 చెల్లించాలి.

# విద్యా రుణం తీసుకునేటప్పుడు తెలుసుకోవాల్సినవి

విద్యకు ప్రాధాన్యత పెరగడం వల్ల చాలా మంది ఉన్నత విద్యనభ్యసించడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీనికి ఖర్చు కూడా అధికంగానే అవుతుంది. ఏటా విద్యా ద్రవ్యోల్బణం 10-15% వరకు ఉంటోంది. భారత్ లేదా విదేశీ కళాశాల/విశ్వవిద్యాలయాల్లో మీ ఉన్నత చదువులకు నిధులు సమకూర్చడానికి విద్యా రుణం ఒక అద్భుతమైన మార్గం. మీకు అర్హత ఉంటే మీ కోసం, మీ జీవిత భాగస్వామి, పిల్లల కోసం ఈ రుణాన్ని తీసుకోవచ్చు. అయితే, అన్ని ఇతర రకాల రుణాల మాదిరిగానే విద్య కోసం రుణం తీసుకునేప్పుడు వీలైనంత ఎక్కువ సమాచారాన్ని తెలుసుకోవడం మంచిది. దరఖాస్తు చేయడానికి ముందు కచ్చితంగా తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలేంటో ఇక్కడ చూద్దాం.

### అర్హత, ప్రమాణాలు

ఎలాంటి రుణానికైనా దరఖాస్తుదారుడికి తగిన అర్హతలుండడం చాలా అవసరం. రుణాలిచ్చే సంస్థలను బట్టి అర్హత, ప్రమాణాలు మారుతుంటాయి. బ్యాంకులు..మీ క్రెడిట్ స్కోరు, ఆదాయం, వయసు, ఇప్పటికే ఉన్న రుణాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రుణ మంజూరుకు సహకరిస్తాయి. ప్రాధాన్యత లేని కళాశాల/విశ్వవిద్యాలయంలో కోర్సులకు, కొన్ని ఖర్చులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు అంగీకరించకపోవచ్చు. ఒక్కోసారి లోన్ మొత్తానికి హామీగా మీ ఆస్తులను తాకట్టు పెట్టవలసి ఉంటుంది. బ్యాంకులు 8-10 ఏళ్ల కాలపరిమితితో విద్యా రుణాలను అందిస్తున్నాయి.

### మారటోరియం వ్యవధి

విద్యా రుణం తీసుకున్న వెంటనే ఈఎంఐ చెల్లింపులు చేయనక్కర్లేదు. కోర్సు పూర్తయిన 6 నెలల వరకు మారటోరియం వ్యవధి ఉంటుంది. కొన్ని బ్యాంకుల్లో ఈ వ్యవధి మారవచ్చు. ఈ వ్యవధి తర్వాత నుంచి ఈఎంఐ చెల్లించాలి. అయితే, మీకు ఆర్థిక సౌలభ్యం ఉంటే ఈ మారటోరియం వ్యవధి పూర్తయ్యే వరకు వేచి ఉండకుండా, రుణం తీసుకున్న మరుసటి నెల నుంచే వడ్డీని చెల్లించొచ్చు. దీని వల్ల బకాయి మొత్తం పెరగకుండా ఉంటుంది.



### వడ్డీ రేట్లు

విద్యా రుణంపై కీలకమైంది వడ్డీ రేటు. వడ్డీ రేటు మీ అర్హత, రుణ మొత్తం, కాలవ్యవధి ఆధారంగా మారుతుంది. భారత్‌లోని కొన్ని అగ్రశేణి బ్యాంకులు సంవత్సరానికి 8.50% నుంచి 16% వరకు వసూలుజేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు 8.50% నుంచి 12.75% వరకు వసూలు చేస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు 10.50% నుంచి 16% వరకు వసూలుజేస్తున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీలు 13% నుంచి 14% వరకు, విదేశీ బ్యాంకులు 12% నుంచి 15% వరకు వసూలుజేస్తున్నాయి.

### వడ్డీ రేటు ప్రభావం

వడ్డీ రేటులో 1-2% మార్పు ఉన్నప్పుడు..వ్యత్యాసం తక్కువగా కనిపించినప్పటికీ, చెల్లించే మొత్తం గణనీయంగా పెరుగుతుంది. ఒక విద్యార్థి ఉన్నత విద్యకు రూ. 20 లక్షల రుణాన్ని, 9% వడ్డీ రేటుతో తీసుకున్నాడనుకుందాం. కోర్సు కాలవ్యవధి 4 ఏళ్లు అయితే, అప్పటి వరకు అతను చెల్లించాల్సిన వడ్డీ మొత్తం(విద్య పూర్తయ్యేనాటికి) రూ. 8.23 లక్షలు అవుతుంది. అప్పుడు రుణం చెల్లించడం మొదలు పెడితే 8 ఏళ్ల పాటు రూ. 19.70 లక్షల వరకు వడ్డీ మొత్తాన్ని చెల్లిస్తాడు. అంటే, ప్రతి నెలా రూ. 41,358 (ఈఎంఐ) చెల్లించాల్సి ఉంటుంది. ఇంతే మొత్తం రుణాన్ని మరొక విద్యార్థి 11% వడ్డీ చెల్లించడానికి అంగీకరించి తీసుకున్నాడనుకుందాం. అప్పుడు అతడు చెల్లించే ఈఎంఐ రూ. 47,691 అవుతుంది. అసలు మొత్తం కాకుండా చెల్లించే వడ్డీయే చివరికి రూ. 25.78 లక్షలు అవుతుంది. వడ్డీ 2% పెరగడం వల్ల 2వ వ్యక్తి, మొదటి వ్యక్తి కంటే దాదాపు రూ. 6 లక్షల వరకు అదనంగా చెల్లించారు. కాబట్టి, రుణగ్రహీతలు వడ్డీపై స్వల్ప వ్యత్యాసాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంతేకాకుండా, ఎక్కువ కాలవ్యవధికి ఈఎంఐ ఎంపికను ఆశిస్తే, ప్రతి నెలా ఈఎంఐ మొత్తం తగ్గినప్పటికీ..మొత్తం చెల్లించే వడ్డీ గణనీయంగా పెరిగిపోతుంది. కాబట్టి, మీ ఆర్థిక సౌలభ్యాన్ని బట్టి రుణ కాలవ్యవధిని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం చాలా మేలు.

### ప్రాసెసింగ్ ఫీజులు

విద్యా రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజును వసూలుజేస్తాయి. ఈ రుసుములు రుణానికి సంబంధించిన అవసరమైన(అడ్మినిస్ట్రేటివ్) ఖర్చులను కవర్ చేయడానికి ఉద్దేశించినవి. ఎస్‌బీఐ రూ. 20 లక్షల లోపు విద్యా రుణంపై ఈ రుసుమును వసూలుజేయడం లేదు. విద్యా రుణం రూ. 20 లక్షలు దాటినప్పుడు రూ. 10 వేలు(ంజీఎస్‌టీ) వసూలుజేస్తుంది. చాలా బ్యాంకులు రుణ మొత్తంపై 0.50% నుంచి 2% వరకు వసూలుజేస్తున్నాయి. విదేశీ బ్యాంకులు 2-5% వరకు వసూలుజేస్తున్నాయి.

### రుణ పంపిణీ

బ్యాంకులు ట్యూషన్ ఫీజులను నేరుగా విశ్వవిద్యాలయానికి పంపిణీ చేస్తాయి. అయితే, విదేశీ విద్య విషయంలో జీవన వ్యయాలను ఫారెక్స్ కార్డులో లేదా వీసా నిబంధనలకు అనుగుణంగా బదిలీ చేస్తాయి. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు రుణాన్ని విద్యార్థి లేదా తల్లిదండ్రుల ఖాతాకు పంపిణీ చేస్తారు. విదేశీ బ్యాంకులయితే సెమిస్టర్ ప్రాతిపదికన ట్యూషన్ ఫీజులు, ఆన్-క్యాంపస్ వసతి ఛార్జీలు విశ్వవిద్యాలయానికి పంపుతాయి.

### పన్ను ప్రయోజనాలు

విద్యా రుణాల విషయానికొస్తే విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న పన్ను ప్రయోజనాల గురించి తెలుసుకోవాలి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80, విద్యా రుణ వడ్డీ చెల్లింపులపై మినహాయింపులను క్లెయిం చేయడానికి అనుమతిస్తుంది. విద్యా రుణాల పన్ను మినహాయింపు మొత్తంపై గరిష్ఠ పరిమితి లేదు. మినహాయింపును క్లెయిం చేయడానికి మీ బ్యాంకు నుంచి రుణ చెల్లింపులకు సంబంధించి ప్రధాన, వడ్డీ భాగాలను స్పష్టంగా వేరుచేసే ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి. చెల్లించిన వడ్డీపై మాత్రమే పన్ను ప్రయోజనాలు ఉంటాయి. అసలు మొత్తం రీపేమెంట్‌పై పన్ను ప్రయోజనం ఉండదు.

# మిడిలార్డర్ కథ మారింది

**"తుదిజట్టులో చోటు లేకపోవడంతో హోటల్ గదిలో సినిమా చూస్తున్నా. అర్ధరాత్రి కెప్టెన్ రోహిత్ ఫోన్ చేసి.. తొలి వన్డేలో కోహ్లి స్థానంలో నువ్వు ఆడాలి అనడంతో వెంటనే టీవీ కట్టేసి పడుకున్నా" ..ఇంగ్లాండ్‌తో మొదటి వన్డే అనంతరం భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలివి. అలా అనుకోకుండా ఆ మ్యాచ్ ఆడిన శ్రేయస్.. టీమ్ఇండియాకు ఇప్పుడు ఎంతో కీలకంగా మారాడు. ఆందోళన రేకెత్తిస్తున్న మిడిలార్డర్‌ను పటిష్ఠంగా మార్చాడు. కొన్నిసార్లు ప్రతికూలం అవుతాయనుకున్న విషయాలు కూడా మేలే చేస్తాయనడానికి ఇదే ఉదాహరణ.**



శ్రేయస్ అయ్యర్ లాంటి నాణ్యమైన బ్యాటర్‌కు భారత జట్టులో సుస్థిర స్థానం లేకపో వడం ఆశ్చర్యం కలిగించిందంటూ ఇటీవల వ్యాఖ్యానించాడు ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్. శ్రేయస్ ప్రతిభకు నిజంగానే అతను భారత జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉండాలి. అతను టీమ్ఇండియా కెప్టెన్ అవుతాడని విశ్లేషకులు అంచనా వేసిన క్రికెటర్. కానీ గాయాలు, నిలకడలేమితో జట్టులో అతడి స్థానానికి గ్యారెంటీ లేకుండా పోయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో అతను ఎంతో నిలకడగా రాణించినా.. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తడం, ఫామ్‌తో తంటాలు పడడం అతడికి చేటు చేశాయి. దీంతో జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టులోకి ఎంపికైనప్పటికీ.. తుది జట్టులో చోటు దక్కించుకోలేని స్థితిలో ఉన్నాడు శ్రేయస్. ఈ సిరీస్‌లో యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో ఆడించాలనుకుంది జట్టు యాజమాన్యం. అయితే తొలి వన్డే ముంగిట కోహ్లి మోకాలు వాచి, మ్యాచ్‌కు దూరం కావడంతో అనుకోకుండా శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కింది. దీన్ని అతను రెండు చేతులా ఉపయోగించుకున్నాడు. మెరుపు అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కోహ్లి తప్పుకోకపోయి ఉంటే తాను ఈ మ్యాచ్‌లో ఆడేవాడిని కాదని స్వయంగా శ్రేయసే చెప్పడం విశేషం.

### అలా కలిసొచ్చింది..

తొలి వన్డేలో కోహ్లి ఆడి ఉంటే వన్డే సిరీస్‌లో శ్రేయస్ పేరే వినిపించేది కాదేమో! యశస్వి జైస్వాల్‌ను సిరీస్‌లో ఓపెనర్‌గా ఆడించి, నాలుగో స్థానంలో గిల్‌ను దించాలని అనుకుంది భారత్. అయితే తొలి వన్డేకు కోహ్లి అందుబాటులో లేకపోవడంతో గిల్ మూడో స్థానంలో దిగాడు. శ్రేయస్ నాలుగులో ఆడాడు. కోహ్లి తొలి మ్యాచ్ ఆడి, జైస్వాల్ రాణించి ఉంటే.. అదే కూర్పు కొనసాగేది. అప్పుడు కొంత కాలంగా భారత్‌ను వేధిస్తున్న మిడిలార్డర్ సమస్య అలాగే కొనసాగేది. ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అది తలనొప్పిగా మారేది. కానీ తొలి వన్డేలో అయ్యర్‌కు అవకాశం రావడం.. మిడిలార్డర్ సమస్యకు తెరదించింది. వరుసగా మూడు వన్డేల్లో శ్రేయస్ రాణించడంతో బ్యాటింగ్ బలోపేతం అయింది. తొలి వన్డేలో భారత్ లక్ష్యం 249 పరుగులు. కానీ 19 పరుగులకే యశస్వి జైశ్వాల్, రోహిత్ పెవిలియన్‌కు చేరుకున్నారు. గత కొంతకాలంగా భారత బ్యాటింగ్ ఓపెనర్ల ఇన్నింగ్స్‌లపైనే ఆధారపడింది. ఓపెనర్లలో ఎవరో ఒకరు ధాటిగా లేదా పెద్ద ఇన్నింగ్స్ ఆడితేనే మిగతా వాళ్లు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 6 ఓవర్లలోపే ఓపెనర్లు నిష్క్రమించడం భారత శిబిరాన్ని ఆందోళనకు గురిచేసింది. కానీ ఆత్మవిశ్వాసంతో క్రీజులో అడుగుపెట్టిన శ్రేయస్ (59).. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అయ్యర్ కంటే ముందొచ్చిన గిల్.. ఆ తర్వాత బరిలో దిగిన అక్షర్ పటేల్ అదే జోరు కొనసాగించడంతో 39 ఓవర్లలోపే భారత్ లక్ష్యాన్ని ఛేదించింది. రెండో వన్డేలో రోహిత్ అద్వితీయ సెంచరీ భారత్ మెరుగైన స్కోరుకు బాటలు వేసినా.. అయ్యర్ (44) ఇన్నింగ్స్ పాత్ర విలువైందే. మూడో వన్డేలో భారత్ భారీ స్కోరు సాధించడంలోనూ శ్రేయస్ (78) ముఖ్య పాత్ర పోషించాడు. గిల్ సెంచరీ ఇన్నింగ్స్‌కు అయ్యర్ దూకుడు ఇరుసులా పనిచేసింది. మొత్తంగా వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగుల్లో గిల్ (259) తర్వాత స్థానం అయ్యర్ (181)దే. అత్యంత కీలకమైన స్థానంలో దూకుడుగా ఆడుతూ ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారాడు. నిజానికి ఇంగ్లాండ్‌తో మొదటి వన్డేలో బరిలో దిగాలనుకున్న బృందమే ఛాంపియన్స్ ట్రోఫీలో తుది జట్టుగా అనిపించింది. టాప్‌ఆర్డర్‌లో జైశ్వాల్, రోహిత్, గిల్.. మిడిలార్డర్‌లో కోహ్లి, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య.. ఆ తర్వాత ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.. బౌలర్లుగా షమి, కుల్‌దీప్, హర్షిత్ రాణా/అర్ష్‌దీప్ సింగ్ బరిలో దిగడం ఖాయంగా కనిపించింది. అయితే ఊహించని విధంగా తొలి వన్డేలో శ్రేయస్ ఆడటం సమీకరణాల్ని మార్చేసింది. ఓపెనర్ స్థానాన్ని గిల్ తీసుకోగా.. మిడిలార్డర్‌లో అయ్యర్ తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు. శ్రేయర్ సత్తా చాటుతుండడంతో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న రాహుల్‌పై భారం కూడా తగ్గినట్లయింది. అంతే కాక అయిదో స్థానం నుంచి ప్రయోగాలు చేసుకునేందుకు జట్టు యాజమాన్యానికి వెసులుబాటు లభించింది. అవసరానికి తగ్గట్లు అక్షర్ పటేల్ లేదా రవీంద్ర జడేజాను అయిదో నంబరులో ఆడించే అవకాశం దొరికింది. అక్షర్ ఇలా ఛాన్స్ దక్కించుకుని రెండు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయ్యర్ తర్వాత రాహుల్, హార్దిక్, అక్షర్, జడేజాల రూపంలో నలుగురు బ్యాటర్ల కుడి, ఎడమల కూర్పులో వాడుకునే సౌలభ్యం ఇప్పుడుంది. మిడిలార్డర్‌లో ఒక్క బ్యాటర్ నిలకడతో మొత్తంగా భారత బ్యాటింగ్ ఆర్డర్లో సమతూకం వచ్చిందనడంలో సందేహం లేదు.



## రోహిత్‌ను ఒప్పించిన బీసీసీఐ..? కొత్త సారథిగా బుమ్రా!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ సిద్ధమవుతోంది. ఆ తర్వాత ఐపీఎల్ మ్యాచులు ఉంటాయి. జూన్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ ప్రారంభమవుతుంది. రోహిత్ శర్మ టెస్టుల్లో కొనసాగుతాడా? లేదా? అనేది ఇంకా తెలియదు. బీసీసీఐ పెద్దలు మాత్రం రోహిత్ స్థానంలో కొత్త సారథిని నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రాకు బాధ్యతలు అప్పగించేలా రోహిత్‌ను ఇప్పటికే ఒప్పించినట్లు కథనాలు వస్తున్నాయి. బుమ్రా వెన్ను నొప్పి కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలిగాడు. గత ఆస్ట్రేలియా పర్యటనలో వెన్ను నొప్పి తిరగబెట్టడంతో జాతీయ క్రికెట్ అకాడమీ వైద్యబృందం స్కానింగ్‌లు నిర్వహించింది. అన్నింట్లోనూ బాగానే ఉన్నప్పటికీ.. పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసేందుకు బుమ్రా ఇబ్బంది పడ్డాడు. దీంతో వైద్య బృందం బుమ్రాను ఆడించే అంశాన్ని సెలక్టర్లకే వదిలేసింది. కేవలం బౌలర్‌గానే కాకుండా.. భవిష్యత్తులో టీమ్ఇండియా కెప్టెన్సీని అప్పగించే ఉద్దేశంతో బుమ్రా విషయంలో రిస్క్ తీసుకోలేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం టెస్టు ఫార్మాట్‌లో బుమ్రానే జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టుకు బుమ్రా సారథ్యం వహించాడు. అప్పటికి రోహిత్ ఇంకా ఆస్ట్రేలియాకు చేరుకోలేదు. ఆ మ్యాచ్‌లో బుమ్రా జట్టును విజయ పథంలో నడిపించాడు. చివరి టెస్టులోనూ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. వెన్ను నొప్పితో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. ఆ సిరీస్‌లో బౌలింగ్‌తోనే కాకుండా తన నాయకత్వ పటిమతో అభిమానులను అబ్బురపరిచాడు. "గత నెలన్నర రోజుల నుంచి బుమ్రా విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడు ఇంకా పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఐపీఎల్ నాటికి అతడు బౌలింగ్ ఫిట్‌నెస్ సాధిస్తాడని క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. రోహిత్‌ను టెస్టులకు ఎంపిక చేయకపోతే మాత్రం.. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు బుమ్రానే సారథి. బీసీసీఐ కూడా ఇదే ఉద్దేశంలో ఉంది" అని పీటీఐ పేర్కొంది.

## భారత క్రికెటర్లను హగ్ చేసుకోవద్దు: పాక్ ఆటగాళ్లకు ఫ్యాన్స్ మెసేజ్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నీలో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఫిబ్రవరి 23న మ్యాచ్ జరగనుంది. దాయాదుల మధ్య పోరంటే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉండటం సహజమే. అదే సమయంలో గత రెండు ఐసీసీ టోర్నీల్లో పాక్‌పై భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి ఎలాగైనా టీమ్ఇండియాను చిత్తు చేయాలని పాక్ ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. అంతేకాకుండా పాకిస్థాన్ గడ్డపై ఆడేందుకు విముఖత చూపించినందుకు భారత ఆటగాళ్లను ఎవరూ హగ్ చేసుకోవద్దని తమ క్రికెటర్లను హెచ్చరించారు. ఈ మేరకు పాక్ జర్నలిస్ట్ ఒకరు తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2017 ఫైనల్‌లో భారత్‌పై విజయం సాధించి పాక్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో టీమ్ ఇండియా చేతిలో ఓటమి పాలైన పాక్.. ఆ తర్వాత పుంజుకొని ఛాంపియన్‌గా నిలిచింది. అప్పటి కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మేం తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓటమిపాలయ్యాం. తర్వాత టీమ్ మీటింగ్ జరిగింది. మా సీనియర్లు షోయబ్ మాలిక్, హఫీజ్.. మమ్మల్ని ప్రోత్సహించారు. అలాంటి వారు మన చుట్టూ ఉండాలి. అప్పట్నుంచి మా మైండ్‌సెట్‌ను మార్చుకున్నాం. జట్టులో కొన్ని మార్పులు చేశాం. మా ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది" అని వ్యాఖ్యానించాడు.

## నీ జీవితాన్ని మార్చేందుకు ఇతరులను అనుమతించకు : యుజ్వేంద్ర చాహల్



భారత స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ విడాకులకు సిద్ధమవుతున్నారంటూ కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఇక చాహల్ తన ఇన్‌స్టా ఖాతాలో ధనశ్రీ ఫొటోలను తొలగించడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వాలెంటైన్స్ డే రోజున చాహల్ పెట్టిన పోస్ట్ తాజాగా నెట్టింట వైరల్‌గా మారింది. "నువ్వు ఎలా ఉన్నావో అలా ఉండు.. ఇతరులు నీ జీవితాన్ని మార్చేందుకు అనుమతించకు" అని యుజ్వేంద్ర చాహల్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ పోస్ట్ దేనిగురించి పెట్టారనే విషయం స్పష్టంగా తెలియకపోయినా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఈ పోస్ట్ పెట్టారని చాహల్ అభిమానులు భావిస్తున్నారు. అయితే చాలాకాలంగా చాహల్ దంపతులు విడిపోతున్నారంటూ వార్తలు జోరుగా ప్రచారమవుతున్నాయి. వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కూడా చేసుకున్న విషయం తెలిసిందే. విడాకుల ఊహాగానాలు జోరందుకోవడంపై తాజాగా చాహల్ నోరు విప్పారు.




దిల్లీ: భారత క్రికెట్‌లో పెరిగిపోతున్న 'సూపర్‌స్టార్ సంస్కృతిని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుబట్టారు. భారత ఆటగాళ్లు నేలవిడిచి సాము చేయకూడదని హితవు పలికాడు. ఒక హిందీ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడుతూ క్రికెటర్లు నటులూ, సూపర్‌స్టార్లూ కాదని కేవలం క్రీడాకారులు మాత్రమే అని స్పష్టం చేశాడు. భారత క్రికెట్‌లో అనేక

## మనం క్రీడాకారులం మాత్రమే.. సూపర్‌స్టార్‌లమేం కాదు

అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ముఖ్యంగా జట్టులో ఎవరూ ఇలాంటి స్టార్ కల్చర్‌ను ప్రోత్సహించకూడదని హితవు పలికాడు. సాధారణ ప్రజల మాదిరిగానే జీవన విధానం కొనసాగించాలని కోరాడు. 'జట్టులో ఎవరైనా ఆటగాడు ఒక సెంచరీ సాధిస్తే అది అతడి గొప్పతనమేమీ కాదు, క్రీడాకారుల రోజువారీ జీవితంలో భాగమేనని గుర్తుంచుకోవాలి మన లక్ష్యాలు వీటి కన్నా ఎక్కువగా ఉండాలి' అని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదుగురు స్పిన్నర్లను తీసుకోవడాన్ని ఆయన ప్రశ్నించిన విషయం తెలిసిందే. "ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ ఐదుగురు స్పిన్నర్లను ఎందుకు ఎంపిక చేసిందో అర్థం కావడం లేదు. యశస్వి జైస్వాల్‌ను తప్పించారు. ముగ్గురు లేదా నలుగురు స్పిన్నర్లను తీసుకుంటారని అనుకున్నా. కానీ, దుబాయ్‌లో ఐదుగురు స్పిన్నర్లెందుకో? నాకు తెలియడం లేదు. బెస్ట్ ఆల్‌రౌండర్లయిన అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలను తుది జట్టు నుంచి తప్పించలేం. హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్ కూడా ఆడతారు. ఒకవేళ వరుణ్ చక్రవర్తిని తీసుకోవాలంటే ఒక ఫాస్ట్‌బౌలర్‌ను తప్పించి హార్దిక్‌ను రెండో పేసర్‌గా ఉపయోగించుకోవాలి. ఒకవేళ మూడో పేసర్‌ను తీసుకోవాలనుకుంటే ఒక స్పిన్నర్‌ను తప్పించాలి. కుల్‌దీప్ తుది జట్టులో తప్పక ఉంటాడు. మరి వరుణ్ చక్రవర్తికి ఎలా అవకాశం కల్పిస్తారు? అతను బాగా బౌలింగ్ చేస్తున్నాడు. కుల్‌దీప్, వరుణ్ ఇద్దరినీ ఆడిస్తే బాగుంటుంది. నా ప్రశ్న ఏమిటంటే.. దుబాయ్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తాయని మీరు ఆశిస్తున్నారా? జట్టు ఎంపిక విషయంలో నాకు కొంత అసంతృప్తి ఉంది" అని అశ్విన్ ఇటీవల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

### రోహిత్ నిస్వార్థపరుడు..

భారత కెప్టెన్ రోహిత్ శర్మపై రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. అతడిని నిస్వార్థమైన క్రికెటర్‌గా అభివర్ణించాడు. "రోహిత్ శర్మ విషయంలో నాకొక విషయం బాగా నచ్చుతుంది. ఇప్పుడున్న క్రికెటర్లలో అతడొక నిస్వార్థ ఆటగాడు. ఒకవేళ అతడే స్వార్థపరుడయ్యుంటే వన్డేల్లోనూ దూకుడుగా ఆడేవాడు కాదు. పవర్‌ప్లేలో భారీగా పరుగులు రాబట్టాలనే ఉద్దేశంతో ఉంటాడు. అందుకే, అతడిపట్ల నాకు అపారమైన గౌరవం ఉంది" అని అశ్విన్ తెలిపాడు.



## ఒకే చోట ధోనీ, హర్భజన్..

ఒకప్పుడు ఎంఎస్ ధోనీ, హర్భజన్ సింగ్ టీమ్ఇండియాలో సహచరులు. ఐపీఎల్‌లోనూ కొన్నాళ్లు కలిసి సీఎస్కే జట్టుకు ఆడారు. ధోనీ సారథ్యంలోనే అటు జాతీయ జట్టుతోపాటు ఐపీఎల్‌లో ఆడటం గమనార్హం. అయితే, తమ మధ్య పదేళ్ల నుంచి మాటలు లేవని ఇటీవల హర్భజన్ సింగ్ ఓ బాంబు పేల్చాడు. వాటిపై ఎంఎస్ ధోనీ మాత్రం స్పందించలేదు. తాజాగా ఓ కార్యక్రమంలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో ఆ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఏ కార్యక్రమం అనేది తెలియకపోయినా ఫ్యాన్స్ మాత్రం ఖుషీ అయిపోయారు. అయితే, ధోనీని సల్మాన్‌గా.. హర్భజన్‌ను అష్నీర్‌తో పోలుస్తూ ఓ అభిమాని వీడియోను షేర్ చేశాడు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌తో తనకు సరైన సంబంధాలు లేవని స్టార్టప్ వ్యవస్థాకుడు, షార్క్ ట్యాంక్ మాజీ జడ్జ్ అష్నీర్ గ్రోవర్ కూడా ఇలానే వ్యాఖ్యలు చేశాడు. " నేను ధోనీ మాట్లాడుకోవడం లేదు. సీఎస్కే తరఫున ఆడినప్పుడు కూడా మేమిద్దరం కేవలం మైదానంలోనే మాట్లాడుకొనే వాళ్లం. అంతకుమించి ఏమీ లేదు. ఇప్పటికి దాదాపు 10 ఏళ్లు అయిపోయింది. సమస్య ఏంటో నాకూ తెలియదు. నా దగ్గరైతే కారణం లేదు" అని హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు.

## వరుస హిట్స్ దూసుకుపోతున్న

# సాయిపల్లవి



మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు తెలుగులో స్టార్ హీరోయిన్ గా రాణిస్తుంది. వరుసగా హిట్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ వరుసగాహిట్స్ అందుకుంటుంది. రీసెంట్ గా అమరన్, తండేల్ సినిమాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శివకార్తికేయన్, సాయి పల్లవిగా జంటగా నటించిన అమరన్ సినిమా తమిళ్ లో తెరకెక్కినా కూడా తెలుగులోనూ సూపర్ హిట్ గా నిలిచింది. ఇక నాగ చైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమా సంచలన విజయం సాధించింది. ఈ సినిమా ఏకంగా 100కోట్లకు పైగా వసూల్ చేసి ఇప్పటికీ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో దూసుకుపోతుంది. సాయి పల్లవికి ఇండస్ట్రీలో ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఎక్కడా స్కిన్ షో చేయకుండా అద్భుతంగా నటించి మెప్పిస్తుంది. సాయి పల్లవి నటి మాత్రమే కాదు అద్భుతమైన డాన్సర్ కూడా.. సినిమాల్లోకి రాక ముందు సాయి పల్లవి పలు టీవీ షోల్లో డాన్స్ చేసింది. తెలుగులో డాన్స్ షో ఢీలోనూ పాల్గొంది సాయి పల్లవి. ఇక సినిమాల్లో సాయి పల్లవి తన డాన్స్ తో ఆకట్టుకుంటుంది. అయితే సాయి పల్లవి ఓ సాంగ్స్ కు స్వయంగా కొరియోగ్రాఫ్ చేసుకున్న విషయం తెలుసా.? సాయి పల్లవి కొరియోగ్రఫీ చేసుకున్న సాంగ్స్ ఏవో తెలుసా.? సాయి పల్లవి ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఓ సీన్ లో హీరోకు అతని ఫ్రెండ్స్ కు సాయి పల్లవి డాన్స్ నేర్పించే సన్నివేశం ఉంటుంది. ఆ సాంగ్ కు సాయి పల్లవి స్వయంగా కొరియోగ్రాఫ్ చేసిందట. అంతే కాదు తెలుగులోనూ సాయి పల్లవి కొన్ని సాంగ్స్ లో స్టెప్స్ ను కొరియోగ్రాఫ్ చేసుకుందట. లవ్ స్టోరీ మూవీలో సారంగ దరియా పాటలో సాయి పల్లవి కొన్ని స్టెప్స్ కంపోజ్ చేసుకుందట. అలాగే నానితో నటించిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో ప్రణవాలయ పాటకి కూడా సాయిపల్లవినే కంపోజ్ చేసిందని టాక్. ప్రస్తుతం సాయి పల్లవి హిందీలో రామాయణం సినిమాలో నటిస్తుంది. అలాగే శింబు సినిమాలోనూ సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుందట.

# రష్మికపై కన్నడిల మండిపాటు

## సొంత ఊరు చెప్పుకోవటానికి ఏంటీ సమస్య?



పుష్ప సినిమాతో నేషనల్ క్రష్ మార్క్ తెచ్చుకుంది కన్నడ బ్యూటీ రష్మిక మందన్న. 'పుష్ప-2'తో పాన్ ఇండియా క్రేజ్‌ను దాటుకుపోయింది. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్‌లోనూ హవా కొనసాగిస్తోంది. శుక్రవారం విడుదలైన 'ఛావా'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ముంబయిలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ వ్యాఖ్యలకు కన్నడిగులు రష్మికపై మండిపడుతున్నారు. "నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. ఇక్కడి ప్రేక్షకులు నాపై చూపిస్తోన్న ప్రేమాభిమానాలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది" అని ఆమె అనడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కర్ణాటకలో దీనిపై చర్చ నడుస్తోంది.. ఆమె వ్యాఖ్యలను పలువురు కన్నడ వాసులు తప్పుపడుతున్నారు. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'విరాజ్‌పేట్ రష్మిక సొంతూరు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చింది? ఈ విషయం మాకు తెలియలేదు..!', 'వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు సొంతూరు గురించి చెప్పడానికి వచ్చిన సమస్య ఏమిటి?' అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో కన్నడిగులు ఆమెపై మండిపడ్డ సందర్భాలున్నాయి. కర్ణాటక, కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన రష్మిక 'కిరిక్ పార్టీ'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు రష్మిక. 'ఛలో'తో టాలీవుడ్‌కి పరిచయమైయ్యారు. ఇక్కడ వరుస విజయాలు అందుకున్న ఆమె స్టార్ హీరోయిన్‌గా జాబితాలో చేరిపోయింది. ఇప్పుడు అగ్ర హీరోల సరసన నటిస్తోంది. అంతే కాదు హిందీ పరిశ్రమలోనూ అవకాశాలు అందుకుంటోంది.

## 'గేమ్ ఛేంజర్'..

# ఆ విషయంలో శంకర్‌ది రిస్క్

### పరుచూరి గోపాలకృష్ణ




ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ 'పరుచూరి పాఠాలు' పేరుతో సినిమాలను విశ్లేషిస్తుంటారనే సంగతి తెలిసిందే. లేటెస్ట్ ఎపిసోడ్‌లో 'గేమ్ ఛేంజర్'పై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రమిది. కియారా అడ్వాణీ హీరోయిన్. జనవరి 10న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ గురించి పరుచూరి ఏమన్నారంటే..? "రామ్ చరణ్‌తో శంకర్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో అంచనాలు నమోదయ్యాయి. కానీ, లాభాలు రాలేదనిపిస్తోంది. ఐపీఎస్ అవ్వాలనుకుని.. ఐఏఎస్ అయిన ఓ యువకుడి కథే 'గేమ్ ఛేంజర్'. చాలామంది దర్శకులు మోడ్రన్ స్క్రీన్‌ప్లేకు అలవాటు పడ్డారు. బాల్కనీలోనే కాదు సెకండ్ క్లాస్‌లోనూ ప్రేక్షకులుంటారనే విషయాన్ని ఇటీవల చాలామంది గమనించట్లేదనేది నా ఉద్దేశం. ఎందుకంటే.. ఈ సినిమా చూసిన నా డ్రైవర్‌ను ఎలా ఉందని అడిగితే 'కలెక్టర్ కథండీ నాకు అర్థం కాలేదు' అని చెప్పాడు. ఇటీవల ఎక్కువ సినిమాల కథలు హీరో- మెయిన్ విలన్‌పైనే నడుస్తున్నాయి. హీరోల పాత్ర విషయంలో తప్పులేకపోయినా వాటిని ప్రెజెంట్ చేయడంలో లోపం తలెత్తుతోందని అనిపించింది. ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలతోనే 'గేమ్ ఛేంజర్'ను ప్రారంభించారు. శ్రీకాంత్ పోషించిన ముఖ్యమంత్రి పాత్ర చుట్టూ ఆసక్తికర సన్నివేశాలు తీర్చిదిద్దారు" "హీరో రోల్ విషయానికొస్తే.. ఐపీఎస్ అవ్వాలనుకునే క్రమంలో యాక్షన్ చేస్తుంటాడు. కానీ, ప్రియురాలి కోసం ఫైట్లు మానేస్తాడు. రామ్ చరణ్ హీరోగా ఈ పాయింట్ సరైంది కాదనేది నా అభిప్రాయం. ఎందుకంటే ఆయన మాస్ హీరో. అలాంటి కథానాయకుడిని క్లాస్‌గా చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. ఇది ఓ రిస్క్. చివరిలో మాత్రం అభిమానులు ఆశించే అంశాలు ఉన్నాయి. నటన విషయంలో చరణ్ అద్భుతం. హీరో పేరెంట్స్ ఎపిసోడ్ కూడా ఆకట్టుకుంటుంది. తల్లి త్యాగాన్ని చక్కగా చూపించారు. తన గురువులాంటి మిత్రుడినే హత్య చేసిన వ్యక్తి ఇందులో ముఖ్యమంత్రిగా కనిపిస్తాడు. ఈ కోణంలో హీరోకి ఓ ప్రతీకార కథ ఉంది" "సెకండాఫ్‌లోని కొన్ని సన్నివేశాలు.. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రూ.2కి కిలో బియ్యం పథకం వంటి వాటిని స్ఫూర్తిగా తీసుకున్నట్టు అనిపించాయి. బాగా చదువుకున్న వ్యక్తికి, రాజకీయ నాయకుడికి వ్యత్యాసం ఎక్కడ ఉందన్న అంశాన్ని అద్భుతంగా విశ్లేషించారు. మినిస్టర్- కలెక్టర్ మధ్య సీన్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. తన తండ్రిని హత్య చేసిన వ్యక్తిని హీరో.. ముఖ్యమంత్రిని చేయడం ప్రేక్షకులకు నచ్చకపోయి ఉండొచ్చేమో. కొన్ని పరిణామాల అనంతరం హీరో సీఎం అయినట్టుగా వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. అంత ఆలస్యం చేయకుండా అతడు నిజంగా ముఖ్యమంత్రిగా చూపించి ఉంటే రెండు పాత్రలు పోషించాల్సి వచ్చేది. అలా ఓ పాత్రలోంచి మరో పాత్రలోకి మారే క్రమంలో పడే కష్టాలు వంటివి చివరి అరగంటలో చూపించి ఉంటే సినిమా మరో రకంగా ఉండేది. పోలింగ్‌కు సంబంధించిన ఓ సీన్ కూడా ఆశ్చర్యం అనిపించింది. హీరోకి రామ్ నందన్ పేరు పెట్టడంలో ఓ అర్థం ఉంది. రాముడు శాంతిస్వరూపుడు అనే విధంగా పాత్రను నడిపించారు. ముందు నుంచీ ఓ పక్కకు నడిచే సునీల్.. హీరో ముఖ్యమంత్రి అయిన వెంటనే సరిగ్గా నడుస్తూ వచ్చి ఆనందంతో సెల్యూట్ చేసి ఉంటే ప్రేక్షకులు చప్పట్లు కొట్టేవారు. రాజ్యాంగం అడ్డంగా నడుస్తుంది కాబట్టి అతడు అడ్డంగా నడిచాడు.. ఇప్పుడు సక్రమం కాబట్టి స్ట్రయిట్‌గా నడిచాడన్న పాయింట్‌తో సినిమా అర్థవంతంగా ముగిసేది. వసూళ్ల విషయం పక్కన పెడితే రామ్ చరణ్ నటన కోసం ఈ సినిమా చూడాలి" అని అన్నారు.



## నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు : సింగర్ మంగ్లీ

దేవుడి కార్యక్రమానికి వెళ్తే, తనపై రాజకీయ పార్టీ ముద్రవేసి ఆరోపణలు చేయడం అన్యాయమని గాయని మంగ్లీ అన్నారు. ఇటీవల ఆమె కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి అరసవల్లి దేవాలయానికి వెళ్లారు. దీనిపై తెదేపా క్యాడర్‌తో పాటు, సామాజిక మాధ్యమాల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో మంగ్లి బహిరంగ లేఖ రాశారు. "2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి చెందిన కొందరు నాయకులు నన్ను సంప్రదిస్తే పాట పాడాను. నేను ఇతర పార్టీలకు సంబంధించిన ఎవరినీ ఒక్క మాట అనలేదు. వైకాపా ఒక్కటే కాదు, అన్ని పార్టీల లీడర్లకు నేను పాటలు పాడా. ఆ పార్టీకి పాట పాడటం వల్ల చాలా అవకాశాలు కోల్పోయా. వైకాపాకు పాడినందుకు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. నా పాట ప్రతి ఇంట్లో పండుగ పాట కావాలి కానీ, పార్టీల పాట కాకూడదన్నది నా అభిప్రాయం. 2024లో ఎన్నికల్లో ఏ పార్టీకీ నేను పాటలు పాడలేదు" "తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకి నేను పాట పాడను అన్నది అవాస్తవం. రాజకీయ లబ్ధి కోసం నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉన్న వ్యక్తి ఆయన. 2019 ఎన్నికల్లో వీడియో క్లిప్పులతో నాపై విషప్రచారం చేస్తున్నారు. నాకు ఎలాంటి రాజకీయ అభిమతాలు, పక్షపాతాలు లేవు. నేను ఏ పార్టీ ప్రచార కార్యకర్తను కాను. ఒక కళాకారిణిగా నాకు నా పాటే అన్నింటికన్నా ముఖ్యం. నా పాటకు రాజకీయ రంగు పులమొద్దు. ఏ రాజకీయ పార్టీలతో నాకు సంబంధం లేదు" అని మంగ్లీ పేర్కొన్నారు.

## 'స్పిరిట్' కోసం నేను దరఖాస్తు చేశా : మంచు విష్ణు



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. పవర్‌ఫుల్ పోలీస్ డ్రామాగా ఇది సిద్ధం కానుంది. త్వరలో పట్టాలెక్కనున్న ఈ సినిమాలో నటించేందుకు అవకాశం కల్పిస్తూ ఇటీవల చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేసింది. వయసుతో సంబంధం లేదనీ, సినిమా - థియేటర్‌కు సంబంధించి అనుభవం ఉన్నవారు ఆసక్తి ఉంటే అప్లై చేసుకోమని కోరింది. దీనిపై తాజాగా మంచు విష్ణు స్పందించారు. తాను అప్లై చేసినట్లు తెలిపారు. చిత్రబృందం నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని వేచి చూస్తున్నట్లు చెప్పారు. అభిమానులందరూ ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 'స్పిరిట్' గురించి గతంలో సందీప్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తొలిరోజే ఇది రూ.150కోట్లు వసూళ్లు చేయడం ఖాయమని అన్నారు. 'స్పిరిట్'లో ప్రభాస్ విభిన్నమైన లుక్‌లో కనిపిస్తారని చెప్పారు. గత 24 సినిమాల్లో ప్రేక్షకులు ఆయన్ని ఒక విధంగా చూశారని.. ఈ చిత్రంలో మరో స్థాయిలో చూస్తారని హామీ ఇచ్చారు. ప్రభాస్‌లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయని ప్రశంసించారు. ఆయన్ని చూపించే విధానం ఆడియన్స్‌కు నచ్చితే చాలు.. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందన్నారు. మంచు విష్ణు ప్రస్తుతం 'కన్నప్ప' రిలీజ్ పనుల్లో బిజీగా ఉన్నారు. 'మహాభారత' సిరీస్‌ని రూపొందించిన ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడు. మోహన్‌బాబు నిర్మాత. ప్రీతి ముకుందన్ హీరోయిన్. ఏప్రిల్ 25న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో రుద్ర పాత్రలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే.

## 'బుజ్జితల్లి' హవా.. వంద మిలియన్

# వ్యూస్ సాధించిన లవ్ సాంగ్



కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో 'తండేల్' పాటల ట్రెండ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఇందులోని బుజ్జితల్లి డైలాగు, పాట తెగ వైరలవుతున్నాయి. సినిమా విడుదలయ్యాక ఎక్కడ చూసినా ఈ పాట రీల్స్ షేర్ అవుతున్నాయి. తాజాగా ఈ లవ్ సాంగ్ రికార్డు సృష్టించింది. యూట్యూబ్‌లో ఏకంగా 100 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. బిగ్‌స్క్రీన్‌పై ఈ పాటను ఎక్కువమంది ఎంజాయ్ చేశారని పేర్కొంది. దేవీశ్రీ ప్రసాద్ అందించిన సంగీతానికి జావేద్ అలీ ఆలపించిన తీరు యూత్‌ను ఆకట్టుకుంది. శ్రీమణి సాహిత్యం పాటకు హైలైట్‌గా నిలిచింది. ఇక బుజ్జితల్లి సాంగ్ శాడ్ వెర్షన్ కూడా వైరలవుతోన్న విషయం తెలిసిందే. థియేటర్‌లలో ఈ శాడ్ వెర్షన్‌కు మంచి స్పందన వస్తోంది. 'ఏమి తప్పు చేశానే..' అంటూ సాగే ఈ గీతాన్ని కూడా జావేద్ అలీ అలపించగా.. శ్రీమణి సాహిత్యం అందించారు. నాగచైతన్య, సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్'. పాటలు, డైలాగులతో భారీ అంచనాలు నెలకొల్పిన హిట్ టాక్‌ను సొంతం చేసుకొని మంచి వసూళ్లను తన ఖాతాలో వేసుకుంటోంది. త్వరలోనే 100 మిలియన్‌ల క్లబ్‌లో చేరేందుకు సిద్ధమైంది. మరోవైపు చిత్రబృందం అన్ని ప్రముఖ నగరాల్లో సక్సెస్ మీట్‌ను నిర్వహిస్తూ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యావాదాలు తెలుపుతోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463